

విద్యాధరి.. విజ్ఞానదాయిని

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు శ్రీసరస్వతీమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాయదుర్గంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో వాసవీమాతను సరస్వతీదేవిగా అలంకరించారు. - న్యూస్‌టుడే, రాయదుర్గం

17 మంది ఎఫ్ఏసీ ఎంపీడీవోల నియామకం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఖాళీగా ఉన్న ఎంపీడీవో పోస్టుల్లను ఆయా కార్యాలయంలో ఏవోలుగా, యూఆర్‌డీవోలుగా పనిచేస్తున్న అధికారులను ఎఫ్ఏసీ ఎంపీడీవోలుగా నియమించారు. బ్రహ్మసముద్రానికి ఎఫ్ఏసీ ఎంపీడీవోగా నందకిశోర్, కంబదూరు రామచంద్ర, కుందుర్పి బాలాజీ, బొమ్మనహళ్ దాసనాయక్, శెట్టూరు రఘురామరావు, వజ్రకరూరు రవిప్రసాద్, చిలమత్తూరు రమణమూర్తి, ఎన్పీ కుంట అంజప్ప, తలుపుల రామానాయక్, తనకల్లు రెడ్డప్ప, గుడిబండ గంగాధర్, పరిగి శ్రీధర్‌రావు, రొద్దం రామకుమార్, కొత్తచెరువు నటరాజ్, నల్లమాడ రాబర్ట్‌విల్సన్, కనగానపల్లి అనిల్‌కుమార్, యల్లనూరుకు వాసుదేవరెడ్డిలను నియమించారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించండి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత ఆదేశించారు. డిగ్రీ పరీక్షలు తప్పినవారికి మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సప్లిమెంటరీ పరీక్షలను ఆమె బుధవారం పరిశీలించారు. ఎలాంటి లోటు లేకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎస్కేయూ, ఆర్ట్స్ కళాశాల, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30 వరకు పరీక్షలు జరుగనున్నాయి.

పల్లె ప్రగతికి రూ.219 కోట్లు

ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు

ఈనాడు, అనంతపురం: వైకాపా ప్రభుత్వం హయాంలో పల్లె ప్రగతి పూర్తిగా పడకేసింది. ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. ఫలితంగా రహదారులు, మురుగు కాలవలు అధ్వానంగా మారాయి. జగన్ పాలనలో పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధుల్ని సైతం దారి మళ్లించడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. తెదేపా కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులపై నిత్యం అనుశీలన చేస్తున్నారు. పల్లె పండగ పేరుతో రాష్ట్రం అంతటా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు రూ.219 కోట్లు కేటాయించారు. 14 నియోజకవర్గాల్లో ఈనెల 14వ తేదీన ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. రహదారులు, మురుగు పారుదల వ్యవస్థ, పాఠశాలల ప్రహరీ తదితర పనులను చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



నూతిమడుగు-ఆత్మకూరు మధ్య అభివృద్ధి చేయనున్న బీటీ రోడ్డు

ప్రజలదే నిర్ణయాధికారం

ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఆగస్టు, 23న గ్రామసభలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరినీ హాజరుపరిచి అధికారుల సమక్షంలో కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో పెండింగ్ పనులు, జరగాల్సిన అభివృద్ధిపై చర్చించారు. అభివృద్ధి పనులపై ఆయా పంచాయతీల్లో సమష్టిగా నిర్ణయం తీసుకున్నారు. జాబితాల్లో మొదటి ప్రాధాన్యంగా రహదారులు, డ్రైనేజీ నిర్మించాలని నిర్ణయించారు. మినీ గోకులాలు, పశువుల షెడ్ల నిర్మాణానికి తీర్మానాలు రూపొందించారు. ఉపాధి హామీ నిధులతో అన్ని గ్రామాల్లో పనులు చేపట్టనున్నారు. 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్ నిధులు కేటాయించడంతో పనులు వేగంగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అనంతపురం జిల్లాలో ఇలా..

నియోజకవర్గం	మంజూరైన పనులు	నిధులు (రూ.కోట్లలో)
ఉరవకొండ	548	17.88
శింగనమల	388	16.66
రాయదుర్గం	416	16.04
తాడిపత్రి	246	16.04
కళ్యాణదుర్గం	152	13.47
రాప్తాడు	219	10.05
గుంతకల్లు	195	6.98
అనంతపురం	40	2.90

అనంతకు 2,204 పనులు మంజూరు

అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని 31 మండలాలకు 2,204 పనులు మంజూరు చేశారు. ఇందుకు గాను రూ.100.01 కోట్లు ఖర్చు చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 725 సీసీరోడ్ల (186 కిలోమీటర్లు) నిర్మాణానికి రూ.88.37 కోట్లు కేటాయించారు. 9 బీటీ రోడ్లకు రూ.7 కోట్లు ఖర్చు చేస్తారు. గార్లదిన్నె మండలంలో 1, కళ్యాణదుర్గం, కూడేరు, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల్లో రెండేసి చొప్పున బీటీ రోడ్లు నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనుల్ని ఇప్పటికే పంచాయతీరాజ్‌శాఖ అధికారులు గుర్తించారు. గ్రామాల్లో రూ.4.64 కోట్లతో 470 మురుగు కాలువలను నిర్మించనున్నారు.

అధికం ఉరవకొండ.. అత్యల్పం తాడిపత్రి

మద్యం దుకాణాలకు 1,686 దరఖాస్తులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : అనంతపురం జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 136 మద్యం దుకాణాలకుగాను బుధవారం సాయంత్రానికి 1,686 దరఖాస్తులు వచ్చాయి. దుకాణానికి సగటున 12కి పైగా అందినట్లు అధికార వర్గాలు తెలిపాయి. జిల్లాలో అత్యధికంగా ఉరవకొండ స్టేషన్ పరిధిలో 7 దుకాణాలకు అత్యధికంగా 180 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యల్పంగా తాడిపత్రి స్టేషన్ పరిధిలో 16 దుకాణాలకు 70 మాత్రమే వచ్చాయి. తాడిపత్రి మున్సిపాలిటీలో 12 దుకాణాలకు, ఒక్కో దుకాణానికి కేవలం రెండు వచ్చాయి. మరోదానికి 3, యల్లనూరు దుకాణానికి 20, పుట్లూరులోని రెండింటికి వరుసగా 15, 8 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కేంద్రం అనంతపురంలో 41 దుకాణాలకు 556, బుక్కరాయసముద్రం 15కి 335, గుత్తిలో 18కి 122, గుంతకల్లులో 14కి 103, కణేకల్లులో 6కి 97, రాయదుర్గం 8కి 147, కళ్యాణదుర్గం 7కి 57, కంబదూరులో 4కి 19 దరఖాస్తులు వచ్చాయి.

ఖరీఫ్ కంది కళకళ


- భారీగా సాగుకు సర్కారు ప్రోత్సాహం
- పంట మార్పిడి దిశగా అన్నదాతలు



సాగులో కంది పంట

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఖరీఫ్ పంట కాలం ముగిసింది. సాగు లెక్కలు తేల్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన పంట వేరుసెనగ. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో వేరుసెనగ సాగు తగ్గిపోయింది. పత్తి పంటది ఇదే పరిస్థితి. ఎన్నడూలేని విధంగా మొక్కజొన్న, కంది పంటలు అనూహ్యంగా పెరగడంతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వేరుసెనగ సాగు చేయాలంటే ఎకరాకు రూ.25 వేలు వెచ్చించాలి. దిగుబడులు తగ్గిపోయి నష్టాలను మూట కట్టుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. దీంతో అనంత రైతులు కంది వైపు మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరాలో కంది సాగుకు రూ.10-12 వేలు ఖర్చవుతుంది. గిట్టుబాటు ధర దక్కడం, బెట్ట పరిస్థితులను తట్టుకునే స్వభావం ఉండడం... విత్తనాలను రాయితీతో ప్రభుత్వం పంపిణీ చేయడం. కంది పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో సాగు భారీగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 1,40,456 హెక్టార్లలో సాగైంది. పంట కాలం ఆరు నెలలు. ప్రస్తుతం పూత దశలో ఉంది. డిసెంబరు, జనవరి నెలల్లో పంటకోతకు వస్తోంది. కాయ దశలో తెగుళ్లు ఆశించకుండా పంటను కాపాడుకుంటే ఆదాయం వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. హెక్టారుకు 10 క్వింటాళ్లు దిగుబడి అంచనా వేశారు. దాని ప్రకారం 1,404.56 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..



గిట్టుబాటు ధరతో...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్ పంటల సాగు సమయంలో మద్దతు ధరలు ప్రకటించాయి. ఈ ఏడాది పంటకు భారీగా మద్దతు ధర కల్పించారు. గత మూడేళ్లలో కంది పంటకు మద్దతు ధరలు పరిశీలిస్తే 2022లో రూ.6,300, 2023లో రూ.7 వేలు, 2024లో 7,550 చొప్పున ప్రకటించారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో కంటే ఎన్డీయే సర్కారు పంటలకు మద్దతు ధర భారీగా ప్రకటించింది.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



ఖరీఫ్‌లో సాగైన కంది పంట ఆశాజనకంగా ఉంది. వచ్చే నవంబరులో పంటంతా పూర్తిస్థాయిలో పూత కొస్తుంది. ప్రస్తుతం శాఖీయ దశ నుంచి పూత దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉంది. మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు ముందుగా వేపనూనె లీటరు నీటికి 5 ఎంఎల్ పిచికారీ చేసుకోవాలి. తీవ్రతను బట్టి క్లోరోఫైరోఫాస్ 2.5 ఎంఎల్, లేదా ప్రోఫెనోఫాస్ రూ.2.0 ఎంఎల్ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. **- డాక్టర్ మల్లీశ్వరి, ప్రధాన శాస్త్రవేత్త-కేవీకే**



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరగాలి: కలెక్టర్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం ఫలితంగా పెట్టుబడి గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఈ దిశగా అన్నదాతల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో వ్యవసాయం, పట్టు పరిశ్రమ, మత్స్య, పశు సంవర్ధక, సహకారం, మార్కెటింగ్, ఉద్యానవనం, ఏపీఎంఐపీ.. తదితర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. జేసీ శివనారాయణ శర్మతో కలిసి అనేక అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. డ్రోన్ల వినియోగంతో వ్యవసాయంలో ఖర్చు బాగా తగ్గించుకోవచ్చు. ఇదే క్రమంలో దిగుబడి కూడా పెంచుకోడానికి అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించి డ్రోన్ల కార్పొరేషన్‌కు తగిన ప్రతిపాదనలు పంపాలన్నారు. వంద రోజుల ప్రణాళికలో ఈ అంశాన్ని చేర్చాలన్నారు. ఈ పంట నమోదు ప్రక్రియపై సూపర్ చెక్ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలి. ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించొద్దన్నారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు విక్రయాన్ని చేపట్టాలన్నారు. ఏ సహకార సంఘం ద్వారా ఎన్ని ఎరువులు అమ్మారన్న దానిపై రోజూ నివేదిక పంపాలన్నారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టాలన్నారు.

సూక్ష్మ సేద్యపరికరాలకు రిజిస్ట్రేషన్...

సూక్ష్మ సేద్యపరికరాల సామగ్రి కోసం అన్నదాతలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 37,500 హెక్టార్లను లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి దాకా రైతు సేవాకేంద్రాల ద్వారా 36,858 మంది రైతులు 52597.85 హెక్టార్లకు సూక్ష్మ సేద్యపరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ప్రస్తుతం 1021 మంది రైతులకు సంబంధించి 1228.52 హెక్టార్ల విస్తీర్ణానికి సంబంధించి తమ వాటాను డిజిటల్ రూపంలో చెల్లించారు. 342 మంది రైతులకు 409.63 హెక్టార్ల విస్తీర్ణంలో సేద్య పరికరాలను మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

కోట్లు దోచుకుంది.. వైకాపా నాయకులే

- ప్రజలకు మంచి చేస్తున్నా ఆరోపణలా?
- తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ధ్వజం

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే : ఐదేళ్లలో ఇసుక, మద్యంలో రూ.వేల కోట్లు దోచుకున్న వైకాపా నాయకులు, మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తారా? అంటూ తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ మండిపడ్డారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ఇసుక, మద్యం టెండర్లలో లేనిపోని ఆరోపణలు చేయడంపై ఆయన స్పందించారు. బుధవారం అనంతపురం అర్బన్‌లో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరైన అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. ఐదేళ్లలో ఇసుక పాలసీలో నిర్మాణ రంగాన్ని కుదేలు చేసింది మీరు కాదా? అని ఆయన ప్రశ్నించారు. పేదలకు ఇసుక ఇవ్వకుండా నాయకులే పెద్ద ఎత్తున దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకొచ్చింది. పేదలకు అందుబాటులో ఉంచాం. కేవలం రవాణా, లోడింగ్ ఖర్చులు మాత్రమే తీసుకుని ఇసుక ఉచితంగా ఇస్తుంటే వంద రోజుల్లోనే రూ.వేల కోట్లు దండుకున్నట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఎక్కువ ధరలకు నాసిరకం మద్యం అమ్మి పేదల ప్రజల జీవితాలతో ఆడుకున్నది మీరు కాదా? అని నిలదీశారు. ఒక్క మద్యంలోనే మాజీ ముఖ్యమంత్రి జగన్ రూ.వేల కోట్లు దోచుకుని అవినీతి పాల్పడ్డారని, ఇసుక, మద్యంపై మాట్లాడే అర్హత ఆ పార్టీ నాయకులకు లేదన్నారు.



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ తదితరులు

సభ్యత్వాలు లక్షకు తగ్గకూడదు..

తెదేపా సభ్యత్వం నమోదు కోసం అనంతపురం అర్బన్ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, సభ్యత్వం లక్ష మందికి తగ్గకూడదని ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఐదోరోడ్డులో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

అంటకాగిన ఆయనకే మళ్లీ పట్టం!

శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈగా సురేంద్ర

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే: గతంలో వైకాపా నేతలతో అంటకాగారన్న ఆరోపణలు ఎదుర్కొన్న ఎస్ఈ సురేంద్రను శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్తుశాఖ ఎస్ఈగా నియమిస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. సురేంద్ర వైకాపా ప్రభుత్వ పాలనలో అనంతపురం టౌన్ డివిజన్ ఈఈగా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తుండగా ఎస్ఈగా పదోన్నతి పొంది ఉమ్మడి జిల్లాకు పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఈఈ, ఎస్ఈగా పనిచేసిన సమయంలో వైకాపాలో కీలకంగా వ్యవహరించిన ఒక మంత్రి ఏం చెప్పినా ఆ పనులు చక్కపెట్టారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల ముందు వైకాపా పాలకులు ఇచ్చిన సిపార్సు లేఖల ఆధారంగా నిబంధనలకు తిలోదకాలిచ్చి వ్యవసాయ సర్వీసులు విడుదల చేసినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల తరువాత సెలవు పెట్టారు. అనంతరం ఆయనకు ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీజీఎం ప్లానింగ్ పోస్టింగ్ ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్తు సర్కిల్‌ను అక్టోబరు 2లోపు ఏర్పాటు చేయాలని సీఎండీ ఉత్తర్వులు జారీ చేసి.. అందుకు అనుగుణంగా సీజీఎం ప్లానింగ్ పోస్టును ఇక్కడికి డైవర్ట్ చేసినా.. ఎస్ఈగా ఎవరినీ నియమించలేదు. సురేంద్ర ఉమ్మడి జిల్లా ఎస్ఈగా పనిచేసిన సమయంలో వైకాపా నేతలు చెప్పిన వారికే వ్యవసాయ సర్వీసులు విడుదల చేశారని, బినామీ పేరుతో కొన్ని ఉపకేంద్రాల నిర్మాణాలను చేపట్టారని, తన అనుయాయులకు సోలార్ రూఫ్‌టాప్‌నకు సంబంధించి అనుచిత లబ్ధి చేకూర్చారని, ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారని, వైకాపా మంత్రి జిల్లాకు వచ్చినప్పుడల్లా విద్యుత్తు అధికారులతో వసూళ్లు చేసి మంత్రికి రాచమర్యాదలు చేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వీటిపై కనీస విచారణ చేయకుండానే తిరిగి శ్రీసత్యసాయి జిల్లాకు ఎస్ఈగా పోస్టింగ్ ఇవ్వటంపై విమర్శలు వస్తున్నాయి. ఏ స్థాయిలో పైరవీలు సాగించారోనన్న చర్చ సాగుతోంది.

ఇంటి పైకప్పుపై సౌర వ్యవస్థకు రాయితీ రుణం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇంటి పైకప్పుపై సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ఔత్సాహికులు ముందుకు రావాలని జేసీ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో సూర్య ఘర్ పథకం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ తర్వాత జేసీ మాట్లాడుతూ ఇళ్ల పైకప్పుపై సౌరవ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే రాయితీ రుణ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. 80 శాతం రుణాలను 7 శాతం వడ్డీతో అందిస్తామన్నారు.

అభివృద్ధి పనులకు గ్రహణం

- వైకాపా ప్రభుత్వంలో సాగని నిర్మాణాలు
- పట్టించుకోకపోతే ప్రజాధనం వృథా



ఆగిపోయిన ఇండోర్ స్టేడియం పనులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : అప్పట్లో తెదేపా ప్రభుత్వం రూ.కోట్లతో చేపట్టిన పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అప్పటి వరకు జరిగిన పనులన్నీ దెబ్బతింటున్నాయి. గత జగన్ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించింది. దాంతో ఆ పనులకు గ్రహణం పట్టింది. వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన పనులకూ అతీగతీ లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఆ పనుల అంశం తెరపైకి వచ్చింది. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై కథనం.

- భాగ్యనగర్‌లో ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.2 కోట్లతో అప్పటి తెదేపా ప్రభుత్వం క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ పనులన్నీ ఆగిపోయాయి. ఫలితంగా గోడలు దెబ్బతింటున్నాయి
- గుంతకల్లు వాసులకు శుద్ధజలాన్ని అందించడానికి అమృత్ పథకం కింద శుద్ధజల కేంద్రం కోసం రూ.9 కోట్లతో పనులు చేపట్టారు. పనులతో పాటు పంపింగ్ గదుల నిర్మాణం సాగుతుండగా వైకాపా ప్రభుత్వం వాటిని ఆపేసింది. ప్రస్తుతం ఆ కట్టడాలన్నీ దెబ్బతింటున్నాయి.
- మురుగు నీటిని శుద్ధి చేయడానికి రూ.27 కోట్లు కేటాయించారు. ఆ పనులకు 2021 సంవత్సరం జనవరి 4న భూమి పూజ చేశారు. గుత్తేదారులు పనులు చేయడానికి ఉత్సాహం చూపకపోవడంతో పనులు సాగలేదు. నాలుగు సార్లు వైకాపా హయాంలో టెండర్లు నిర్వహించారు. పనులు మాత్రం ఇంత వరకు ప్రారంభించలేదు.
- మైనార్టీ విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయడానికి గతంలో తెదేపా ప్రభుత్వం రూ.18 కోట్లతో భవన నిర్మాణ పనులు ప్రారంభించింది. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పనులను ఆపేసి నిధులు దారి మళ్లించింది.
- మొదీనాబాద్‌లో అమృత్ పథకం కింద రూ.54 లక్షలతో పార్కు ఏర్పాటు పనులు ప్రారంభించగా గత వైకాపా ప్రభుత్వం పనులను పట్టించుకోలేదు.
- చెత్తను సేకరించి దాన్ని తడి, పొడి చెత్తగా వేరు చేయడానికి పట్టణంలో మూడు చోట్ల గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ కేంద్రాలను రూ.2.22 కోట్లతో నిర్మించడానికి భూమి పూజ చేశారు. ఒకచోట పనులు ప్రారంభించి, మరో రెండుచోట్ల ఆఊసే ఎత్తలేదు.

పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం..

- భవానీ, పురపాలక ఛైర్‌పర్సన్

గతంలో ప్రారంభించి తరువాత ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తాం. నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతాం. ఆయా పనులన్నీ సాధ్యమైనంత వరకు పూర్తి చేస్తే పట్టణ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.

జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవోగా వెంకటసుబ్బయ్య

అనంతపురం విద్య: జిల్లా పరిషత్తు ఇన్‌ఛార్జి సీఈవోగా వెంకటసుబ్బయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఈవోగా నియమితులైన రామచంద్రారెడ్డి విధుల్లో చేరడం ఆలస్యం కావడంతో డిప్యూటీ సీఈవోగా ఉన్న వెంకటసుబ్బయ్యకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

అన్న క్యాంటీన్లు పేదలకు వరం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రూ.5కే కడుపు నిండా అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు పేదలకు వరం లాంటివని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం కళ్యాణదుర్గంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్, శుద్ధజల ప్లాంటును బుధవారం ఇన్‌ఛార్జి ఆర్డీఓ వినూత్న, డీఎస్పీ రవిబాబుతో కలిసి ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల కడుపు నింపేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు భాస్కర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, సీనియర్ నాయకులు మల్లికార్జున, ఆర్.జి.శివశంకర్, రామ్మోహన్‌చౌదరి, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు వై.పి.రమేష్, రామలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ జీవితచరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని విడుదల చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్ర ఎంతో గొప్పదని సేవాలాల్ ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు పేర్కొన్నారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో వెలసిన సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో బుధవారం ఉదయం సేవాలాల్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్రను తెలుగు వివిధ భాషల్లో పుస్తకాలు రూపొందించామన్నారు. అనంతరం 'మాతా జగదాంబ' ఆలయంలో దేవీశరన్నవ రాత్రులను పురస్కరించుకొని జగదాంబ దేవిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ట్రస్ట్ సభ్యులు అశ్వర్థ నాయక్, అర్చకుడు మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం కింద అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోడానికి అవకాశం కల్పించామని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఖుష్బు కొఠారి తెలిపారు. ఇంటర్ అనంతరం ఉన్నత విద్య చదివే విద్యార్థులు రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ చేయడానికి జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో కళాశాల యాజమాన్యాలు లాగిన్‌లో పొందుపరిచారు. ప్రక్రియ మొత్తం ఈనెల 30 లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. సంబంధిత కళాశాలలోని స్కాలర్ షిప్ విభాగంలో వివరాలు నిర్వహించే సిబ్బంది తక్షణం విద్యార్థుల దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

కాలుష్య కోరల్లో పచ్చని పంటలు

● దిగుబడిపై తీవ్ర ప్రభావం ● ఆందోళనలో రైతులు



ఎదుగుబొదుగు లేని అరటి తోట

తాడిమర్రి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పచ్చని కూరగాయలు, పండ్ల తోటలు.. కళకళలాడుతూ పెరగాల్సినవి వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుని.. కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాడిమర్రి మండల పరిధిలోని దాడితోట సమీపాన అదానీ సంస్థ హైడ్రో పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఇందుకుగాను కొండలో భారీ నిర్మాణం చేపడుతున్నారు. ఈక్రమంలో కొండను తవ్వి మట్టిని గుట్టగా పోస్తున్నారు. వందలాది వాహనాలలో తెచ్చిన మట్టి పెద్ద కొండగా తయారైంది. దీనికి ఆనుకునే అరటి, దానిమ్మ, చీనీతో పాటు వరి, టమాటా, మిరప తదితర పంటలు సాగులో ఉన్నాయి. మట్టికొండ నుంచి గాలికి వస్తున్న తెల్లటిపొడి దిగువన ఉన్న తోటలపై పడుతోంది. ప్రధానంగా అరటికాయలు పిందెదశలోనే రాలిపోతున్నాయి. దానిమ్మ పూత నిలువడటం లేదు. వరిపైరు పెరగడం లేదు. దీంతో రూ.లక్షలు ఖర్చుచేసి రసాయన మందులను పిచికారీ చేసినా ఫలితం లేకుంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



అరటి చెట్టుపై తెల్లగా ఇలా..

600 ఎకరాల్లో...

హైడ్రో పవర్ ప్రాజెక్టు సమీపంలోనే వంద మంది రైతులకు సంబంధించిన 600 ఎకరాలు సాగులో ఉన్నాయి. పరిశ్రమ నుంచి వస్తున్న తెల్లటి పొడితో పంటలు దెబ్బతింటున్నాయి. రూ.లక్షలు అప్పుచేసి పంటలను సాగు చేయగా ఎదుగుబొదుగు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అరటి సాగు చేసిన ఆరు నెలలకు సుమారు ఆరు అడుగులు పెరిగి.. గెలలు వీడాల్సి ఉంది. వాయు కాలుష్య ప్రభావంతో మొక్క మూడు అడుగులకే పరిమితమైంది. ఇప్పటికే అరటి సాగుచేసి ఆరు నెలలు గడుస్తోంది. ఇంత వరకు గెలలు ఏర్పడలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటల్లో పిందెలు రాలిపోతున్నాయి. ఇటీవల ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్.. కడప జిల్లా పర్యటనకు దాడితోట మీదుగా వెళుతుండగా. . బాధిత రైతులు కలిసి సమస్యను వివరించారు. రూ.లక్షల పెట్టుబడులు వృథాగా పోతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి స్పందించి.. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



పిందె దశలోనే రాలుతున్నాయి..

ఆరు నెలలైనా మొక్క పెరగడం లేదు



నాలుగు ఎకరాలలో రూ.6 లక్షలు ఖర్చుచేసి అరటి సాగు చేశా. మొదటి నుంచి మొక్క పెరగకపోవడంతో పిలకలు నాసిరకమని అనుకున్నా. మిగతా తోటల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. మొక్కలపై తెల్లటి పొడి పడుతుండటంతో సమస్యను గుర్తించాం. పలు రకాల మందులు పిచికారీ చేసినా ఎలాంటి ఫలితం లేదు. **- శ్రీనివాస్‌రెడ్డి, రైతు**

పరిష్కారం చూపాలి



అరటి, టమాటా సాగు చేశాను. రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే వృద్ధిలోకి రావడం లేదు. తోటలపై పడుతున్న పొడి తొలగించాలని ప్రయత్నిస్తే సాధ్యం కావడం లేదు. రోజూ ఇదే పరిస్థితి ఉంది. అధికారులు పరిష్కారం చూపాలి. **- హరి, రైతు**

పరిశీలించి.. తగిన చర్యలు తీసుకుంటాం

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. సమస్యను ఉన్నతాధికారులతోనూ చర్చిస్తా. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. **- మహేష్, ఆర్డీవో..ధర్మవరం**

డిగ్రీ పరీక్ష ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అధికారులు

ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలలో మే నెలలో నిర్వహించిన యూజీ హానర్స్ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు బుధవారం ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు విడుదల చేశారు. బీఏ విద్యార్థులు 461 మందికి 108 మంది ఉత్తీర్ణులయ్యారు. బీబీఏ 818 మందికి 353 మంది, బీసీఏ 174 మందికి 62, బీకాం 4512 మందికి 1635, బీఎస్సీ 2586 మందికి 1234 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 39.67 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్ కోసం ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల మెరుపులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం, క్రీడలు, న్యూస్‌టుడే : ఈ నెల 6 నుంచి 8వరకు తిరుపతిలో జరిగిన పాఠశాల రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. అండర్ 14, అండర్ 17, తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 38 కేజీల విభాగంలో కె.ద్రిషణ, 45 కేజీల విభాగంలో ఎల్.గౌతం కృష్ణారెడ్డి, 63 కేజీల విభాగంలో వి.హరి చరణ్‌తేజ పసిడి పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4, 5 తేదీల్లో రైల్వే కోడూరులో జరిగిన అండర్ 19 పోటీల్లో 68 కేజీల విభాగంలో ఎం.లిఖిత్‌కుమార్ బంగారు పతకం, నివాస్ రజతం సాధించారు. జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు నవంబరులో మధ్యప్రదేశ్‌లో జరగనున్నాయి. స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వారి వారి పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, తైక్వాండో అకాడమీ సభ్యులు అభినందించారు.

అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం, క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్ జిల్లా అండర్ -14 క్రికెట్ జట్టును జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి ప్రకటించారు. గ్రూప్-బీ విభాగంలో నరసరావుపేటలో జరగనున్న అండర్-14 క్రికెట్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుంది. ఈ నెల 10 నుంచి 23 వరకు ఈ పోటీలు జరగనున్నాయి.

ఎంపికైన జట్టు వివరాలిలా... టీ కిరణ్‌కుమార్(కెప్టెన్), కె.ఆషీశ్ ఆచారి (ఉపసారథి), గోకుల్, ఆదినారాయణరెడ్డి, హేమచంద్ర నాయక్, రోహిత్, పంకజ్‌మీనా, భవన్‌రెడ్డి, కార్తిక్, హేమంత్‌కుమార్, ప్రణధీర్, లిఖిత్, దేవస్కంద, వెంకటసాయి, దేవాన్ష్ రోహిత్, ఉత్తేజ్ యాదవ్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ జట్టుకు శిక్షకుడిగా ఆర్.కుమార్ వ్యవహరిస్తున్నారు.



ఎంపికైన జట్టు సభ్యులు

మంత్రతంత్రాలు నమ్మడమే ప్రాణాలు తీసింది

● నగలు కాజేయాలనే ధర్మవరం సీఐ తల్లి దారుణ హత్య ● నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుడిని చూపుతున్న అన్నమయ్య ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వయసు రీత్యా వచ్చే అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు నమ్మిన మంత్ర తంత్రాలు, మూఢ నమ్మకాలు వృద్ధురాలి ప్రాణాలు తీశాయి. తనకు పరిచయం ఉన్న కుటుంబానికి చెందిన యువకుడే శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం సీఐ తల్లిని హత్య చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. మదనపల్లెలో సంచలనం సృష్టించిన ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి పేరం స్వర్ణకుమారి (63) హత్య కేసులో నిందితుడైన వెంకటేష్‌ను బుధవారం అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఎస్పీ వివరాలు వెల్లడించారు. స్వర్ణకుమారి కుమారుడు ఉద్యోగ రీత్యా ధర్మవరం సీఐగా పనిచేస్తుండగా ఆమె మదనపల్లెలోనే ఉంటున్నారు. వీరి ఇంటి పక్కనే ఉండే వెంకటేష్ స్వగ్రామానికి చెందిన యువకుడే కావడంతో ఏదైనా తెప్పించుకోవాలన్నా, ఎక్కడైనా వెళ్లాలన్నా అతని సాయం తీసుకునేవారు. వెంకటేష్, అతని స్నేహితుడు అనీల్ ఆర్థిక సమస్యలతో స్వర్ణకుమారి నగలు కాజేయాలని పథకం వేశారు. ఆమెకు మూఢ నమ్మకాలను అలుసుగా తీసుకుని తన స్నేహితుడు ఇంటికి స్వామీజీ వచ్చాడని అతను మంత్రిస్తే జబ్బులు తగ్గిపోతాయని వెంకటేష్ నమ్మబలికాడు. దీంతో గతనెల 28న అతనితో పాటు ద్విచక్రవాహనంపై వెళ్లిన ఆమెను నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధికి తీసుకెళ్లి ముందుగా అనుకున్న పథకం ప్రకారమే ఆమె కొబ్బరి నీళ్లలో మత్తు మాత్రలు కలిపి ఇచ్చారు. ఆమె కొంత సమయానికి స్పృహ కోల్పోగా సుత్తితో తలపై కొట్టి చంపేశారు. అదే రోజు ఆమె నుంచి నగలు తీసుకుని స్థానిక ఫైనాన్స్ సంస్థలో రూ.4.97 లక్షలకు కుదువ పెట్టారు. తన తల్లి కనపడకపోవడంతో కుమారుడు నాగేంద్రప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 2న అదృశ్యం కేసు నమోదు చేసి పలు బృందాలతో విచారణ ప్రారంభించారు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో వెంకటేష్ నిందితుడిగా గుర్తించి అతని కోసం గాలిస్తుండగా మంగళవారం మదనపల్లె - బెంగళూరు మార్గంలోని చీకలబైలు చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశారు. నిందితుడు ఇచ్చిన వివరాల మేరకు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం అనంతరం పక్కనే అంత్యక్రియలు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రైవేట్ సంస్థలో పెట్టిన నగలను రికవరీ చేశారు. అలాగే ఆమెను సాయిరాం వీధి నుంచి అయోధ్యానగర్‌కు అద్దెకు తీసుకున్న కారును సీజ్ చేశారు. వెంకటేష్‌ను అరెస్టు చేశామని ఈ కేసులో నిందితులుగా ఉన్న అనిల్, ఈ హత్యకు సహకారం అందించిన అనిల్ తల్లి రమాదేవి, ఫైనాన్స్ సంస్థ నుంచి తెచ్చిన డబ్బులో రూ.లక్ష తీసుకున్న వెంకటేష్ తల్లి ఎల్లమ్మలను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. వీరి కోసం ఓ బృందం గాలిస్తోందన్నారు. అరెస్టు చేసిన నిందితుడు వెంకటేష్‌పై పీలేరు, మదనపల్లెలో కేసులు ఉన్నాయని స్పష్టం చేశారు. గంజాయి మత్తులో హత్య చేశారని సమాచారం ఉందని విలేకరులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా వెంకటేష్ గంజాయి తీసుకొనేవాడని సమాచారం ఉందని అయితే ఈ హత్య దానికోసం జరగలేదన్నారు. కేవలం నగలు కాజేసేందుకు మాత్రమే జరిగిందని తెలిపారు. ఈ కేసులో నిందితులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన సీఐ కళా వెంకటరమణ, సాంకేతిక నిపుణుడు రామచంద్ర, క్రైం పార్టీ సిబ్బంది మహమ్మద్, నరసింహులు, రఘునాథ్‌రెడ్డిలకు జిల్లా ఎస్పీ రివార్డులు అందజేశారు.

రాగిపాత్రకు మహిమలున్నాయంటూ మోసం

ముగ్గురి అరెస్ట్, రూ.25 లక్షల నగదు స్వాధీనం



నిందితులు శివసంతోష్, మంజునాథ్‌రెడ్డి, ప్రతాప్. చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు, రాగిపాత్ర

ఈనాడు, హైదరాబాద్-రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: తమ వద్ద ఉన్న పురాతన రాగి పాత్రకు అద్భుత మహిమలున్నాయంటూ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.25లక్షల నగదు, రాగిపాత్ర, 7 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర వివరాలు తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన శివసంతోష్, చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన జి.మంజునాథ్‌రెడ్డి, బెంగళూరుకు చెందిన ప్రతాప్ ముఠాగా ఏర్పడి రైస్‌పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన శశికాంత్‌కు మిత్రుడి ద్వారా మంజునాథ్‌రెడ్డి పరిచయమయ్యాడు. తాను రైస్‌పుల్లింగ్ యంత్రంతో రూ.10కోట్లు లాభపడినట్టు మంజునాథ్‌రెడ్డి అతడికి వివరించాడు. దాన్ని కొనేందుకు చాలామంది పోటీపడుతున్నారని తన పలుకుబడితో సొంతమయ్యేలా సహకరిస్తానంటూ భరోసానిచ్చాడు. కొద్దిరోజుల తరువాత శశికాంత్‌కు ఎస్‌డీరోడ్‌లోని ఓ హోటల్‌లో శివసంతోష్‌ను పరిచయం చేశాడు. తన వద్ద ఉన్న రాగి పాత్ర శక్తిని తెలుసుకునేందుకు డీఆర్‌డీవో రూపొందించిన స్కానర్ ద్వారా పరీక్షించుకోవచ్చని సలహా ఇచ్చాడు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తగా ప్రతాప్‌ను రంగంలోకి దింపి పరిచయం చేశారు. స్కానర్‌పై పరీక్షించేందుకు అడ్వాన్స్‌గా ఈనెల 6న రూ.25లక్షలు తీసుకున్నారు. శశికాంత్ రాగి పాత్ర గురించి అడిగితే మరో రూ.25లక్షలు కావాలంటూ మెలికపెట్టారు. అనుమానం వచ్చిన బాధితుడు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రూ.2కోట్లు, కరీంనగర్ నివాసి రూ.40లక్షలు, నిజామాబాద్‌లో ఉంటున్న ఒకరు రూ.10లక్షలు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. విజయవాడ, గుంటూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పెద్దఎత్తున బాధితులున్నట్టు అంచనా వేస్తున్నారు. ఈ ముఠా పురాతన రాగిపాత్రలో మహిమలున్నాయంటూ అందులో రసాయనం ఉంచి బియ్యం పోసేవారు. కొంత సమయానికి అవి పచ్చరంగులోకి మారటంతో తేలికగా నమ్మేవారు.

అంగన్‌వాడీ పోస్టులకు 16 నుంచి ఇంటర్వ్యూ

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లాలో ఖాళీగా ఉన్న 84 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఈ నెల 16 నుంచి మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ) ఉంటుందని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి ప్రకటించారు. ఈ నెల 16న అనంత ఆర్డీఓ, 17న కళ్యాణదుర్గం, 18న గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు ఈ ప్రక్రియ మొదలు కానుంది. ఆయా ప్రాజెక్టుల పరిధిలో సంబంధిత ఆర్డీఓ కార్యాలయాలకు హాజరు కావాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 9, మినీ కార్యకర్తలు నాలుగు, సహాయకుల పోస్టులు 71 ప్రకారం ఖాళీగా ఉన్నాయి. అర్హుల నుంచి గత నెల 25 నుంచి ఈనెల 1 దాకా దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. మొత్తం 303 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తుల వడపోత తర్వాత నిర్దేశిత అభ్యర్థినులు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె వెల్లడించారు. ఇప్పటికే అర్హులైన వారికి సమాచారం పంపించామన్నారు.

ఆశ చూపి.. డబ్బులు లాగేసి!

➠ రూ.65 లక్షలు దోచుకున్న సైబర్ నేరగాళ్లు ➠ ఆలస్యంగా వెలుగుచూసిన నేరాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ నేరాల గురించి నిత్యం మీడియా, సోషల్ మీడియా, పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా ప్రజలు మోసపోతూనే ఉన్నారు. అత్యాశ, అవగాహన లేమితో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. తక్కువ పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆశజూపిన సైబర్ నేరగాళ్లు ఇద్దరు బాధితుల నుంచి ఏకంగా రూ.65 లక్షలు కాజేసిన ఘటన నగరంలో ఆలస్యంగా వెలుగు చూసింది.

● నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో నివశిస్తున్న సోమశేఖర్‌కు ఇటీవల ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'తాను కేరళకు చెందిన తన్వీర్ అని పరిచయం చేసుకున్నాడు. షేర్ మార్కెటింగ్‌లో తనకు కొన్నేళ్లుగా అనుభవం ఉందని, తమకు చెందిన 'ఐపీవో షేర్ మార్కెట్'లో పెట్టుబడులు పెడితే అతి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ జూపాడు. అతని మాటలు నమ్మిన బాధితుడు తనకు ఉన్న వివిధ బ్యాంకు ఖాతాల నుంచి రూ.32.19 లక్షలు అపరిచిత వ్యక్తి ఖాతాకు బదిలీ చేశాడు. రోజులు గడిచినా చెల్లించిన డబ్బు రెట్టింపు కాకపోవడంతో బాధితుడు.. నేరగాడిని అడిగాడు. అందుకు బదిలీ చేసిన మొత్తంలో మరో 18 శాతం నగదును బదిలీ చేయాలని కోరాడు. అపరిచిత వ్యక్తిపై అనుమానం రావడంతో ఆరా తీశాడు. అలాంటి షేర్ మార్కెట్ లేదని తెలుసుకున్నాడు. తిరిగి అవతలి వ్యక్తికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



● నగరంలోని చంద్రమౌళికి గత నెలలో సంజనరామ్, భరత్ భాస్కర్ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేశారు. తమకు గోల్డ్ మైనింగ్‌లో అపార అనుభవం ఉందని, అందులో పెట్టుబడులు పెడితే రెట్టింపు ఆదాయం ఇస్తామని, తమ మైనింగ్‌కు సంబంధించి 'మెజూరీ యాప్'నకు 'సెబీ' నుంచి అనుమతులు ఉన్నాయని నమ్మబలికారు. వ్యాపార భాగస్వామిగా చేరాలని ఒత్తిడి తెచ్చారు. అత్యాశకు పోయిన బాధితుడు తన బ్యాంకు ఖాతా నుంచి అవతలి వ్యక్తులు సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.33 లక్షలు బదిలీ చేశాడు. త్వరలో మైనింగ్ కార్యకలాపాలు, ఆదాయం గురించి మాట్లాడుకుందామని తెలిపారు. నెల రోజులు దాటినా అవతలి వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తిరిగి నేరగాళ్లు ఇచ్చిన ఫోన్ నంబర్లకు ప్రయత్నించగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేశాడు.

చీనీ మొక్కలు, బిందు సేద్యం పరికరాల కత్తిరింపు



దుండగులు కత్తిరించిన చీనీ మొక్కలను చూపుతున్న రైతు రత్నమ్మ

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలంలోని ఓ వ్యవసాయ పొలంలో సాగు చేసిన చీనీ మొక్కలను, బిందు సేద్యం పరికరాలను దుండగులు కత్తిరించారు. బాధితుల వివరాల మేరకు.. కలగళ్ల గ్రామానికి చెందిన రత్నమ్మ కుటుంబానికి మరుట్ల-2 పరిధిలో 5.10 ఎకరాల తోట ఉంది. అందులో బోరు ఆధారంగా నెలన్నర కిందట 800 చీనీ మొక్కలు నాటారు. మంగళవారం రాత్రి దుండగులు 350 మొక్కలను, బిందు సేద్యం పరికరాలను కత్తిరించారు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు కుటుంబం మొక్కలు, పరికరాలను చూసి రోదించారు. రూ.లక్షలు ఖర్చు చేసి, కష్టపడి సాగు చేసిన చీనీ మొక్కలను దుండగులు కత్తిరించి పడేయడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయారు. కూడేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చౌకబియ్యం పట్టివేత

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సీఐ సురేశ్‌బాబు తెలిపిన వివరాలిలా.. మండలంలోని లత్తవరం తండాకు చెందిన దేవేంద్ర నాయక్, వజ్రకరూరు మండలం ప్యాపిలికి చెందిన సాయికుమార్, శివశంకర్, కొనకొండ్లకు చెందిన నారాయణస్వామి, భావనేశ్ 140 సంచుల బియ్యాన్ని ఓ వాహనంలో మంగళవారం రాత్రి పొద్దుపోయిన తరువాత తరలిస్తుండగా హనుమాన్ నగర్‌లో పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

విధులకు వెళ్తుండగా ఆగిన ఉద్యోగి గుండె



రంగనాథ్

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే : మడకశిర మండలం గుర్రపుకొండ గ్రామానికి చెందిన రంగనాథ్ (45) బుధవారం విధులకు వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన శూన్యపెట్టుబడి ప్రకృతి వ్యవసాయం (జడ్‌బీఎన్ఎఫ్) సంస్థ అమరాపురం మండలం తమ్మడేపల్లి యూనిట్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారాయన. ఉదయాన్నే ద్విచక్ర వాహనంపై విధుల నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యంలో ఛాతిచొప్పి వచ్చింది. నెమ్మదిగా వాహనాన్ని రోడ్డు పక్కన వదిలి అక్కడిక్కడే కుప్పకూలిపోయారు. గతంలో గుండెకు సంబంధించి చికిత్స చేయించుకున్నారాయన. రంగనాథ్ మృతికి జడ్బీఎన్ఎఫ్ సిబ్బంది సంతాపాన్ని తెలియజేశారు.

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ


ఫాదర్‌ఫెర్రర్ విగ్రహం వద్ద స్పెయిన్ బృందం సభ్యులు

ఫెర్రర్ ఆలయ సందర్శన

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పిలోని ఫాదర్‌ఫెర్రర్ దేవాలయాన్ని స్పెయిన్ దేశస్థుడు ఈవాన్ మ్యానువాల్ ఆధ్వర్యంలో 33 మంది సభ్యులు సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు వారికి స్వాగతం పలికారు. ఫాదర్‌ఫెర్రర్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్యాన మందిరంలో సభ్యులు ధ్యానం చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, స్పాన్సర్ డైరెక్టర్ శోభ, డైరెక్టర్ నాగప్ప, రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు ఓబయ్య, రాజగోపాల్, మల్లికార్జున, శ్రీరాములు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల ఔదార్యం

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు ఆర్‌ఎంపీల సంఘం నాయకులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా 9న వైద్య పరీక్షలకు హాజరయ్యే గర్భిణులకు అన్న వితరణ చేస్తామని ఆ సంఘం అధ్యక్షుడు చిరంజీవి తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు అమలు పరుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, సందేష్, బాలాజీనాయక్ తదితరులు ఆర్‌ఎంపీలకు ప్రాథమిక చికిత్సకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీల సంఘం కార్యదర్శి అంజి, ఉపాధ్యక్షుడు జనార్దనరెడ్డి, మల్లికార్జున, హనుమంతప్ప, ఖాజాహుసేన్ పాల్గొన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి

శెట్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నంపల్లిలో రైతు వెంకటేశులుకు చెందిన దూడ చిరుత దాడిలో మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. అటవీ ప్రాంతం సమీపంలో పొదల్లో పశువులు మేతకు వెళ్లాయని, పొదల్లో కాపు కాచిన చిరుత దూడపై దాడి చేసిందని బాధిత రైతు వాపోయారు. బాధిత రైతుకు పరిహారం మంజూరు అయ్యేలా చూస్తామని ఎఫ్‌బీవో తిమ్మక్క తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని భూపసముద్రం వేదవతి హగరి నుంచి రాయదుర్గం పట్టణానికి మంగళవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. వాటిని తహసీల్దార్ శ్రీనివాసులుకు అప్పజెప్పనున్నట్లు పోలీసులు తెలిపారు.

బండల ట్రాక్టర్ బోల్తా

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని గోవిందవాడ క్రాస్ వద్ద నల్లబండల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ హెచ్చెల్సీ పంట కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. డ్రైవర్, హమాలీలు త్రుటిలో తప్పించుకున్నారు. తాడిపత్రి నుంచి నల్ల బండలను దర్గాహొన్నూరుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.


మహిళ ఆత్మహత్యాయత్నం

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ కలహాలతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. కుటుంబసభ్యులు ఆమెను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు సమాచారం.

తూకాల్లో మోసాలు.. అధికంగా వసూళ్లు

● చౌక దుకాణాల్లో డీలర్ల దోపిడీ

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం నియోజకవర్గంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రాజకీయ జోక్యం, అధికారుల నిర్లక్ష్యంతో డీలర్లు, ఎండీయూ వాహనదారులు కుమ్మక్కై కార్డులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎండీయూ వాహనాలు సుమారు 50 దాకా ఉన్నా.. అవి ఇళ్ల వద్దకు వెళ్లడం లేదు. ప్రభుత్వం మాత్రం వాహన ఆపరేటర్లకు నెలకు రూ.21వేలు చెల్లిస్తోంది. చేసేది లేక ప్రజలు చౌక దుకాణాలకు వెళ్లి సరకులు తీసుకుంటున్నారు.



డీలర్ల మాయాజాలం

చౌక దుకాణాల్లో ఎలక్ట్రానిక్ యంత్రాలున్నా డబ్బాలతో తూకాలు తక్కువగా వేస్తూ డీలర్లు ప్రజలను మోసగిస్తున్నారు. 20 కిలోల బియ్యానికి మూడు కిలోలు తక్కువగా వేస్తున్నారు. 15 కిలోలకు 12కిలోలే వేస్తున్నాని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. ఇక అర కిలో చక్కెర రూ.17కు అమ్మాల్సి ఉండగా డీలర్లు రూ.20 చొప్పున, కంది పప్పు కిలో రూ.67 కాగా రూ.70కు విక్రయిస్తున్నారు. రాయదుర్గం పట్టణంతోపాటు మండలం, గుమ్మఘట్టకు ఒకే సీఎస్‌డీటీ ఉండటంతో పర్యవేక్షణ కరవైంది. ఇతర మండలాల్లో సీఎస్‌డీటీలు ఉన్నా తనిఖీలు చేయడం లేదు. దాంతో డీలర్లు, వాహన ఆపరేటర్లు సరకులను నల్లబజారుకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రెండు, మూడు కిలోలు కొట్టేస్తున్నారు



- గంగమ్మ, రాజీవ్‌గాంధీ కాలనీ, రాయదుర్గం

నాకు 15 కిలోల బియ్యం వేయాలి. చౌక దుకాణంలో 15 కిలోలకు 13 కిలోలే వస్తున్నాయి. అర కిలో చక్కెర రూ.17 అయితే డీలరు రూ.20 తీసుకుంటున్నారు. ఎండీయూ వాహనాలు ఇళ్ల వద్దకు రావటం లేదు. సరకుల కోసం దూర ప్రాంతాల్లోని స్టోర్‌లకు వెళ్లి తెచ్చుకుంటున్నా.


రాయదుర్గంలో సరకుల కోసం వరుసలో నిల్చున్న కార్డుదారులు

సక్రమ సరఫరాకు చర్యలు

నిత్యావసర వస్తువులను సక్రమంగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లతో సమావేశం నిర్వహించి ఇళ్ల వద్దకే వెళ్లి సరకులు అందించేలా ఆదేశిస్తాం. తూకాల్లో మోసాలు, అధిక ధర వసూలు చేసే వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

- నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

మండలాల వారీగా కార్డుల వివరాలు	
రాయదుర్గం	29,235
గుమ్మఘట్ట	16,427
డి.హీరేహాళ్	14,208
బొమ్మనహాళ్	18,236
కణేకల్లు	19,541

రూ.5కే భోజనం.. పేదల్లో ఆనందం


భోజనం తింటున్న ప్రజలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: నాణ్యమైన, రుచికర భోజనం రూ.5కే అందించే అన్న క్యాంటీన్ అందుబాటులోకి రావడంతో పేద ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గంలోని బళ్లారి రోడ్డులో రూ.38.54 లక్షలతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను బుధవారం స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణానికి పనులపై వచ్చిన పలువురు భోజనం తిని ఆనందించారు. అన్నదాత సుఖీభవ అని దీవించారు.

మనసున్న నేత చంద్రబాబు

- నారాయణ, గొర్రెల వ్యాపారి, ముష్టూరు, ఉరవకొండ మండలం



ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టాలనే ఆలోచన ఉన్న గొప్ప నాయకుడు చంద్రబాబునాయుడు. ఆయనకు చేతులెత్తి దండం పెడుతున్నా. గ్రామం నుంచి గొర్రెలు తెచ్చి కళ్యాణదుర్గంలో విక్రయిస్తుంటా. డబ్బులు తక్కువగా ఉండటంతో చాలా సార్లు కడుపు మాడ్చుకోవాల్సిన పరిస్థితి. రూ.5కు టీ కూడా రాదు. అటువంటిది అన్నం పెట్టి కడుపులు నింపుతుండటం అభినందనీయం.

ఆకలి బాధ తీరింది



- రామలింగ, రైతు, ఎర్రమల్లేపల్లి

పనుల నిమిత్తం కళ్యాణదుర్గం వస్తుంటాం. డబ్బు లేక ఒక్కోసారి కడుపు మాడ్చుకొని ఇంటికి వెళ్లేవాణ్ని. చంద్రన్న పేదల బాధలు తెలుసుకొని అన్న క్యాంటీన్‌ను అందుబాటులోకి తేవడంతో ఇప్పుడు ఆ బాధ తప్పింది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులతో శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేయించడం అభినందనీయం.

మూడు పూటలా కడుపు నింపుకొంటున్నా..

- భార్గవ్, ప్రైవేట్ ఉద్యోగి



మాది కర్నూలు. ఇక్కడ అద్దె గదిలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నా. విధులకు వెళ్లాల్సి వచ్చినప్పుడు సమయం ఉండదు. అల్పాహారం తిని కాలం వెళ్లదీశా. అన్న క్యాంటీన్ అందుబాటులోకి రావడంతో రూ.5కే మూడు పూటలా కడుపు నింపుకొనే భాగ్యం కలిగింది.

రుణపడి ఉంటాం



- గోవిందప్ప, గంగమ్మ, కళ్యాణదుర్గం

అన్న క్యాంటీన్ ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్న చంద్రబాబుకు రుణపడి ఉంటాం. భోజనం ఇంట్లో వండినట్లే రుచిగా ఉంది. ఇంత నాణ్యమైన భోజనం రూ.5కే అందించడం సంతోషంగా ఉంది.

ఎంపీడీఓకు సత్కారం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ ఎంపీడీఓ రవిప్రసాద్‌ను తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, నాయకులు బుధవారం కలిశారు. సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అనంతరం వారు ఎంపీడీఓను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రాజేశ్, సుంకన్న, తాజ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో లాభాలు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక లాభాలు గడించవచ్చని కళ్యాణదుర్గం కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్, డాక్టర్ శిరీష, రాయదుర్గం ఉద్యానశాఖ అధికారి మౌనిక పేర్కొన్నారు. రాయదుర్గం, డి.కొండాపురం గ్రామాల్లో ఉద్యాన శాఖ అమలు చేయనున్న పథకాల గురించి బుధవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

కనీస సమాచారం ఇవ్వకుండా సామాజిక తనిఖీ నిర్వహిస్తారా?

ఉరవకొండ, న్యూస్‌టుడే: గ్రామాల్లో కూలీలకు, ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వకుండా సామాజిక తనిఖీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం ఏంటని ఉపాధి అధికారులను తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, మాజీ వైస్ ఎంపీపీ పెద్దకొట్ల రాజేశ్ ప్రశ్నించారు. బుధవారం వారు ఉపాధి కార్యాలయానికి వెళ్లి సామాజిక తనిఖీ వివరాలు ఆరా తీశారు. గత వైకాపా ప్రభుత్వంలో చేసుకున్న అక్రమాలు బహిర్గతం కాకుండా చూడటానికే ఉపాధి అధికారులు తీరు అన్నట్లుగా ఉన్నారు. తనిఖీని పకడ్బందీగా నిర్వహించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: కంబదూరు శ్మశానవాటికకు వెళ్లే రహదారిపై ఎరువు దిబ్బలు వేశారు. కంపచెట్లు పెరిగాయి, తొలగించాలి. - హనుమంతరాయుడు

సమస్య: పెద్ద కాలువలో మురుగు నీరు నిల్వ చేరింది. కాలు మోపడానికి వీలులేకుండా ఉంది. శుభ్రం చేయించాలి. - అంజన్న

సమాధానం: సమస్యలను పరిశీలించి, పరిష్కరిస్తాం. - రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి, కంబదూరు

సమస్య: రాయదుర్గంలోని ఆసుపత్రి ఎదుట అడ్డంగా ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - ప్రదీప్

సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. - భాస్కర్, ఏఎస్సై

సమస్య: పట్టణంలోని దస్తు రోడ్డు నుంచి కొలిమి వీధిలోకి వెళ్లే సందులో వీధి దీపం వెలగడం లేదు. - నూర్‌మహ్మద్

సమాధానం: మరమ్మతు చేయిస్తాం. - జగన్నాథ్, ఫిట్టర్

సమస్య: ఉరవకొండ 2వ వార్డులోని పాత గుజరీ వీధిలో కుళాయిలకు దుర్వాసన, రంగు మారిన నీరు సరఫరా అవుతున్నాయి. - విశ్వనాథ్, ఉరవకొండ

సమాధానం: పరిశీలించి, శుద్ధ జలం సరఫరాకు చర్యలు చేపడతాం. - విజయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, ఉరవకొండ

- న్యూస్‌టుడే, కంబదూరు, రాయదుర్గం పట్టణం, ఉరవకొండ

దుర్గాన్ని ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం ప్రజావేదిక వద్ద ఉపాధి హామీ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 3,550 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి అనుమతులు వచ్చాయన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 15న బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పల్లె పండగ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, డ్వామా ఏపీడీ రమేష్‌నాయక్, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓలు, ఏపీఓలు, మండల ఇంజినీర్లు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బాల్య వివాహాలను నిర్మూలించి.. బాలిక విద్యను ప్రోత్సహిద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతోపాటు అదనపు కలెక్టర్ వినూత్న, డీఎస్పీ రవిబాబు హాజరయ్యారు. అధికారులతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. **శెట్టూరు:** యాటకల్లులోని కుణే రామలింగేశ్వరస్వామిని బుధవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ఏడు శౌరీల గుడికట్టు అన్నదమ్ములు ఎమ్మెల్యే, ఎంపీలను సన్మానించారు. యాటకల్లుకు చెందిన కాడప్ప దంపతులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.10 వేలు అందజేశారు.

ఆదాయ వనరుల పెంపుతో పంచాయతీల అభివృద్ధి

కణేకల్లు, న్యూస్‌టుడే: ఆదాయ వనరులు పెంపొందించుకొని గ్రామ పంచాయతీలను అభివృద్ధి బాట పట్టించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓ ఆర్డీ చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచి, ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పాలన, మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛత, ఆదాయ వనరుల పెంపు, అభివృద్ధి ప్రణాళికలు తదితర అంశాలపై పంచాయతీ పాలక వర్గం విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

సీఎస్‌డీటీగా దుర్గాప్రసాద్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం సీఎస్‌డీటీగా దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సివిల్ సప్లైస్ ఉప తహసీల్దారు సుబ్రహ్మణ్యం రాయదుర్గానికి వెళ్లారు.

స.హ చట్టం సామాన్యులకు వజ్రాయుధం

కుందుర్పి, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టం.. సామాన్యులకు వజ్రాయుధమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స.హ. చట్టంపై రైతులు, సిబ్బందికి మండల వ్యవసాయాధికారి మహేశ్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో వీలైనంత అవసరమైన సమాచారం పొందేందుకు సమాచార చట్టం పూర్తి అండగా ఉంటున్నట్లు తెలిపారు. స.హ.చట్టం మండల సమాఖ్య అధ్యక్షుడు గోపాల్, సభ్యులు శ్రీనివాసులు, ఈరన్న, బి.గోపాల్, ఉద్యాన అధికారి గౌసియా, ఏఈఓ రమేశ్, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రోడ్డును కప్పేస్తున్న పిచ్చిమొక్కలు



కళ్యాణదుర్గంలోని విద్యుత్తుశాఖ కార్యాలయం నుంచి అమ్మమాంబ ఆలయం వరకు రోడ్డును పిచ్చిమొక్కలు కప్పేస్తున్నాయి. వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమకు సంబంధం లేదని ఒకరిపై ఒకరు చెబుతుండటం గమనార్హం.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

చింతర్లపల్లిలో తాగునీటి సమస్య

శెట్టూరు మండలం చింతర్లపల్లిలో తాగునీటి సమస్య నెలకొంది. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నీరు గ్రామానికి సరఫరా అయ్యేవి. కార్మికులు సమ్మెలో ఉండటంతో సమస్య జటిలంగా మారింది. గ్రామస్థులు వ్యవసాయ తోటలకు వెళ్లి బోరు నీటిని తెచ్చుకుంటున్నారు. సమస్యను సర్పంచి గౌరమ్మ, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా కొత్తగా బోరు వేయించాం. త్వరలో మోటారు ఏర్పాటు చేసి సమస్య తీరుస్తామన్నారు.

- న్యూస్‌టుడే, శెట్టూరు



వేలాడుతున్న యమపాశాలు



రాయదుర్గం పట్టణంలోని ఉట్ల కుంటపైన చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. లారీలు, ఇతర లోడు వాహనాలు వస్తే తీగలు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెదేపా 28వ వార్డు ఇన్‌ఛార్జి పొరాళుధనార్జున, రాజశేఖర్, తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఒకమారు విద్యుత్తు తీగలు తెగిపోతే జాయింట్లు వేశారన్నారు. దీనిపై విద్యుత్తుశాఖ ఏఈ బాలచంద్రను వివరణ కోరగా త్వరలో తీగలు సరి చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం

కుంట కాదు.. రోడ్డే

ఉరవకొండ పట్టణంలో గ్యాస్ గోదాము నుంచి ఎస్‌బీఐ వైపు మట్టి రోడ్డుపై వర్షపునీరు నిలిచి, కుంటను తలపిస్తోంది. దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నీరు నిల్వ చేరకుండా పంచాయతీ అధికారులు మట్టి తోలించారు. దాన్ని పూర్తిస్థాయిలో చదును చేయలేదు. ఫలితంగా దారి రూపు కోల్పోయింది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ



రెండు చౌక డిపోల జప్తు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాళ్ గ్రామాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రెండు చౌక డిపోలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. శ్రీధరఘట్ట గ్రామంలో విజిలెన్స్ అధికారులు స్టాక్‌ను తనిఖీ చేయగా బియ్యం, పంచదార విషయంలో తేడాలు ఉన్నట్లు, గోనేహాళ్ గ్రామంలో జొన్నలు కన్నా బియ్యం స్టాక్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని విజిలెన్స్ సీఐ జమీల బాషా హెచ్చరించారు.

అందుబాటులో ఇసుక

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కణేకల్లు మండలం రచ్చుమర్రి శాండ్ స్టాక్ యార్డ్‌లో 13,280 టన్నుల ఇసుక అందుబాటులో ఉందని ఇన్‌ఛార్జి ఆర్డీఓ వినూత్న తెలిపారు. ఇసుక కావాల్సిన వారు 'ఎస్ఏఎన్‌డీ.ఏపీ.జీవోవీ.ఇన్'లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పైపులైన్ నిర్మాణానికి మోక్షమెన్నడో?


రహదారి పక్కన నిరుపయోగంగా పైపులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ పట్టణంలో తాగునీటి సమస్య పూర్తిగా తీరాలంటే కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ప్రత్యేకంగా పైపులైన్ నిర్మించాల్సి ఉంది. ఈ పనులను జలజీవన్ మిషన్ కింద చేపట్టనున్నారు. నిధులు సైతం మంజూరు అయ్యాయి. అయితే పనులు ప్రారంభం కాలేదు. ఎప్పుడు నిర్మిస్తారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఉరవకొండ పట్టణంలో ఏటా జనాభా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా కుళాయిలకు నీరు సరఫరా కావడం లేదు. నిత్యం ఏదో ఒకచోట సమస్య ఉత్పన్నం అవుతూనే ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత మంత్రి పయ్యావుల కేశవ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. నీటి సరఫరాను మెరుగు పరిచేలా చర్యలు చేపట్టారు. పూర్తిస్థాయిలో మెరుగు పడడానికి ఈ పైపులైన్ నిర్మాణం దోహదపడనుంది. దాంతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా సంపు నిర్మించనున్నారు.

గత ఐదేళ్లలో పట్టించుకోని వైకాపా ప్రభుత్వం



ఉరవకొండ పట్టణంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు గతంలోనే తెదేపా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే కూడేరు తాగునీటి పథకం నుంచి నీటిని సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించింది. ప్రత్యేక పైపులైన్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇంతలో వైకాపా ప్రభుత్వం ఏర్పడింది. పైపులైన్ నిర్మాణాన్ని తాము పూర్తి చేస్తామంటూ ఆ పార్టీ నాయకులు ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకు జాతీయ రహదారి వెంబడి మరో పథకంలో నిరుపయోగమైన పైపులను ఏర్పాటు చేయించారు. ఐదేళ్లల్లో ఒక్క అడుగు పడలేదు. ఎక్కడ సమావేశాలు జరిగినా హడావుడి చేశారు. ఓటర్లను నమ్మించేందుకు విశ్వప్రయత్నం చేశారు. కూటమి ప్రభుత్వం దానిపై దృష్టి సారించి, త్వరితగతిన పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనుల ప్రారంభం

ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అగ్రిమెంటు ప్రక్రియ పూర్తయ్యింది. మంత్రి పయ్యావుల కేశవ్ దిశానిర్దేశం చేశారు. పనులు అనుకున్న సమయంలో పూర్తి చేయడానికి కృషి చేస్తాం.

- అంజుమన్‌షఫ్రీన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఉరవకొండ

సరస్వతీమాత.. నమోస్తుతే


కళ్యాణదుర్గంలో సరస్వతీదేవిగా వాసవీ మాత


కళ్యాణదుర్గం గ్రామీణం: మల్లిపల్లి చౌడేశ్వరిదేవి


ఉరవకొండ: విద్యాలక్ష్మిగా ఉద్భవలక్ష్మి


రాయదుర్గం: గద్వాల యల్లమ్మ



ఉరవకొండ: ఉరగాద్రి చౌడేశ్వరి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అమ్మవార్లను బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. - న్యూస్‌టుడే బృందం


కణేకల్లు: వాసవీమాత


బొమ్మక్కపల్లిలో రాజరాజేశ్వరీదేవి


శాంతినగర్‌లో బన్నిమహాంకాళి


బొమ్మనహాళ్: కొలగానహళ్లిలో ..


ఉరవకొండ: దుర్గాభవాని


కళ్యాణదుర్గం గ్రామీణం: మారెమ్మ దేవత

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి


నృత్యం చేస్తున్న చిన్నారులు

తిరుమలలో చిన్నారుల నృత్య ప్రదర్శన

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తికి చెందిన చిన్నారులు తిరుమలలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నృత్యంతో అలరించారు. బుధవారం తిరుమలలో నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో స్వామికి నృత్య నిరాజనం పలికారు. వీరు అర విందా ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి


గ్రామ సభలో పాల్గొన్న ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతకల్లు గ్రామీణం: ఎస్సీ వర్గీకరణ తర్వగా అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బందారు శంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కసాపురంలో ఎంఈఎఫ్ ఏపీ జెన్‌కో రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకుల గంగారాజు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మున్నెపాకుల రమేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: వెంకటాంపల్లిలోని పాత సచివాలయం సమీపంలో కాలువలు లేవు. మురుగురోడ్లపై పారుతోంది. **- భరత్**
సమాధానం: మురుగు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. **- నాగభూషణం, ఈఓఆర్డీ** - న్యూస్‌టుడే, గుంతకల్లు గ్రామీణం
సమస్య: ఇరువెందుల ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేవు. **- ఓబులేశు**
సమస్య: తరిమెల ప్రధాన మార్గంలో కాలువలను శుభ్రం చేయడం లేదు. **- షేక్షావలి**
సమాధానం: పై సమస్యలను పరిష్కరిస్తాం. **- నిర్మలాకుమారి, ఎంపీడీవో**

స్పందనకు వందనం

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిపై మున్సిపల్ సిబ్బంది మురుగునీటిని తొలగించారు. ఈనెల 9న 'గత మెంతో ఘనం.. నేడు దైన్యం' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ సిబ్బంది రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించడంతో పాటు రహదారిని శుభ్రం చేసి బ్లీచింగ్ పొడి చల్లారు.

స్వచ్ఛత అంటే.. ఇదేనా?

కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద అపరిశుభ్రత


బెంచికొట్టాల సుభాష్ చంద్రబోస్ స్కూల్ వద్ద మురుగు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు మున్సిపాలిటీలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద అపరిశుభ్రంగా ఉంటున్నాయి. పారిశుద్ధ్యం లోపించడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్రస్థాయిలో విద్యాలయాల వద్ద చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలతో పరిస్థితి దారుణంగా ఉంటోంది. వీటి కారణంగా దోమల బెడద ఎక్కువ ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కార్మికుల చేత శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పిచ్చిమొక్కలతో అపరిశుభ్రత

ఎక్కడెక్కడంటే?

★ గుంతకల్లు భాగ్యనగర్‌లోని మున్సిపల్ ఓవర్ హెడ్ ట్యాంకు రోడ్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆనుకొని నాలుగు అడుగుల ఎత్తు వరకు పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. పిచ్చి మొక్కలు ఉండటంతో విషపురుగుల బెడద ఎక్కువగా ఉంది. పక్కనే ఎస్‌జేపీ ఉన్నత పాఠశాల ఉంది. అక్కడా పిచ్చిమొక్కలు కనిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యం కార్మికుల చేత వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

★ బెంచికొట్టాల ఏరియాలో సుభాష్ చంద్రబోస్ పాఠశాల వద్ద మురుగు కాలువలో పూడిక పేరుకుపోయింది. రోజులు గడుస్తున్నా మురుగు తొలగించటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

★ పాత గుంతకల్లులో రాజేంద్రప్రసాద్ ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


నిర్వాహకులతో చర్చిస్తున్న జిల్లా బాలల సంరక్షణాధికారిణి వెంకటేశ్వరి

బాలుర ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

గుంతకల్లు, న్యూస్‌టుడే: అనాథ బాలుర ఆరోగ్యం విషయంలో శరణాలయ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా బాలల సంరక్షణాధికారిణి వెంకటేశ్వరి అన్నారు. పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఉన్న విశ్వహిందూ పరిషత్ నిర్వహిస్తున్న అనాథ బాలుర శరణాలయంలో బుధవారం స్వచ్ఛతపై ప్రత్యేక అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం శరణాలయానికి చెందిన కమిటీ నాయకులతో చర్చలు జరిపారు. శరణాలయ నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి, వెంకటేశులు, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

పాతకక్షలతో దాడి


గాయపడిన రామ్‌ప్రసాద్

యాడికి, న్యూస్‌టుడే: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డంతో గాయాలైన ఘటన సి.లక్ష్మంపల్లిలో బుధవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు సి.లక్ష్మంపల్లికి చెందిన రామ్‌ప్రసాద్‌కు అదే గ్రామంలోని నాగరాజు కుటుంబంతో గతంలో జరిగిన చిన్న పిల్లల గొడవ విషయంలో పాత కక్షలు ఉన్నాయి. ఈక్రమంలో రామ్‌ప్రసాద్ భార్యతో కలిసి సమీపంలో ఉన్న పొలం వద్దకు వెళ్లేందుకు ఆటో కోసం ఉండగా, అదే రస్తాలో నాగరాజు తన అనుచరులతో గొడవ పడ్డారని బాధితుడు వాపోయారు. తాను దారికి అడ్డులేకున్నా ఉన్నా వంటూ కుటుంబ సభ్యులతో తిరిగి వచ్చి తనపై కట్టెలతో దాడి చేశారని ఆరోపించారు. గాయాలు కావడంతో రామ్‌ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన ఆరుగురిపై బాధితుడు పిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిందితుడి అరెస్టు

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైల్లో ప్రయాణికుల బంగారు నగలు, ఇతర వస్తువులను చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న దొంగను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. గుంటూరు జిల్లా మాచర్ల చెందిన సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి గుంతకల్లు జంక్షన్‌లో తమకు పట్టుబడ్డాడని రైల్వే ఎస్పై మహేంద్ర విలేకరులకు చెప్పారు. ఇతని వద్ద ఉన్న రూ.3 లక్షల విలువచేసే 60 గ్రాముల బరువైన నగలను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు.

పోలీసుల అదుపులో మట్కా బీటర్లు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లలదొడ్డి క్రాస్ వద్ద మట్కా నిర్వాహకులను అరెస్టు చేసినట్లు గ్రామీణ ఎస్‌ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. వైటీ చెరువుకు చెందిన రామాంజనేయులు, అంజన్న ప్రసాద్‌లు మట్కా చీటీలతో గొల్లలదొడ్డి క్రాస్ వద్ద పాల్పడిలిలి చెందిన వెంకటేశులు అందజేస్తుండగా దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

రెవెన్యూ సిబ్బంది బదిలీ

పుట్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో పని చేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయినట్లు తహసీల్దారు శేషారెడ్డి పేర్కొన్నారు. సీఎస్‌డీటీగా పని చేస్తున్న ఇంతియాజ్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజు సీఎస్‌డీటీగా బాధ్యతలు చేపట్టారు. వీఆర్‌ఓలు అంకన్న, పెద్దన్న, రిజ్వానా, నాగభూషణం, శ్యామల ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు.

శిథిలావస్థలో పురపాలక దుకాణసముదాయం



భవనాల స్లాబ్ దెబ్బతినిందిలా

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణంలో కూరగాయల మార్కెట్‌లోని కొన్ని మున్సిపల్ కాంప్లెక్స్ గదులు శిథిలావస్థకు చేరాయి. అంజుమన్ రోడ్డు పక్కన ఉండే గదుల్లో కొన్నింటికి స్లాబ్‌లు దెబ్బతిన్నాయి. సిమెంటు పెచ్చులూడి కడ్డీలు తేలి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. బాడుగకు తీసుకున్న వారు నెలకు అద్దెలు వేలకు వేలు చెల్లిస్తున్నా ఇక్కడి పరిస్థితిని పట్టించుకోవడం లేదని దుకాణదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని వారు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల ప్రగతి


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తదితరులు

నార్పల, న్యూస్‌టుడే: తెదేపా, జనసేన కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఆమె నార్పలలో తెదేపా నాయకులతో కలిసి రూ.36 లక్షలతో నిర్మించే నూతన సీసీ రహదారులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు వెంకటనరసానాయుడు, ప్రతాప్, చంద్రబాబు, ఎర్రినాగప్ప, కుళ్లాయప్ప, జాఫర్ పాల్గొన్నారు.

రైల్వే కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం

గుంతకల్లు, న్యూస్‌టుడే: రైల్వే ఉద్యోగులు, కార్మికుల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్‌కు విజయాన్ని చేకూర్చాలని యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, అధ్యక్షుడు సుదర్శన్‌రాజు అన్నారు. రైల్వేలో కార్మిక సంఘాల గుర్తింపు కోసం రైల్వే అధికారులు డిసెంబరు 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు డివిజన్‌లో పోలింగ్‌ను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నాయకులు బుధవారం డివిజన్‌లోని గుంతకల్లు నుంచి కర్నూలు జిల్లా బేతంచెర్ల వరకున్న పలు రైల్వే స్టేషన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో యూనియన్ నాయకులు రాజశేఖర్, దేవరాజ్, సుధాకర్, సురేశ్, పెన్షనర్ల విభాగం కార్యదర్శి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని పాత సాయికృష్ణ నర్సింగ్ హోమ్ వెనుక వైపున ఇంటి వద్ద కర్ణాటక మద్యం అమ్మకాలు చేస్తున్న వీరమ్మ అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ సీఐ మస్తాన్ తెలిపారు. 20 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎంపీఆర్‌డ్యామ్ గ్రామానికి చెందిన మధుసూదన్, సోమశేఖర్లు బుధవారం మద్యం సీసాలు తీసుకెళ్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌస్ బాషా తెలిపారు. గార్లదిన్నె నుంచి 24 మద్యం సీసాలు తీసుకెళ్తుండగా అందిన సమాచారంతో తనిఖీ చేసి సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా డోన్ జాతీయరహదారిలోని యు.కొత్తపల్లి సమీపంలో ఆటోను, గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరుకు చెందిన ఓబులపతి ఆటోలో నిమ్మకాయలు లోడ్ చేసుకుని కర్నూలు వైపు వెళ్తుండగా, బుధవారం తెల్లవారుజామున డోన్ సమీపంలోని యు.కొత్తపల్లి వద్ద ఆటో పంక్చర్ అయ్యింది. ఆటోను ఆపి చూస్తుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఓబులపతి అక్కడికక్కడే ప్రాణాలొదిలారని సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చెక్‌డ్యామ్‌లో జారిపడి యువకుడి మృతి

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: చెక్‌డ్యామ్‌లోకి జారిపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. బేతాపల్లికి చెందిన కొత్తూరు నాగరాజు(35) ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం మూడు గంటలకు తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలోని చెక్‌డ్యామ్‌లోకి జారిపడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన బేతాపల్లి పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈత రాకపోవడంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని వన్నెదొడ్డి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ, ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. కరీంనగర్‌కు చెందిన మోహన్ కృష్ణ కటుంబ సభ్యులతో బెంగళూరుకు వెళ్తుండగా వన్నెదొడ్డి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై కారు పంక్చర్ కావడంతో టైరు మార్చడానికి రోడ్డు పక్కన నిలిపారు. ఈక్రమంలో వెనుకనుంచి వచ్చిన మరో వాహనం ఢీకొంది. ఈఘటన మోహన్ కృష్ణ భార్య శిరీషకు తీవ్ర గాయ్యాలయ్యాయి. ఇద్దరు చిన్నారులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుల తల్లికి విశేషపూజలు


గుంతకల్లు.. మస్తాన్‌పేట మారెమ్మ ఆలయంలో


కల్లూరులో సరస్వతీదేవి


పామిడి : భోగేశ్వర ఆలయంలో..


గార్లదిన్నెలో..


యాడికిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


తాడిపత్రిలో గాయత్రీదేవి


గుంతకల్లులో కన్యకా పరమేశ్వరి


పాత గుంతకల్లులో త్రిపుర సుందరీదేవి


గుత్తిలో చదువుల తల్లిగా అమ్మవారు

దసరా శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో బుధవారం అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్తు దీపకాంతులతో అలరారాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.
- న్యూస్‌టుడే బృందం


కొట్టాలపల్లిలో సరస్వతీదేవి



శింగనమలలో కొలువుదీరిన అమ్మవారు

గ్రంథాలయాల సమస్యలు పరిష్కరిస్తాం


దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా అధికారిణి రమా

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ శాఖ అధికారిణి రమా తెలిపారు. బుధవారం ఆమె గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, పుస్తకాల నిల్వను పరిశీలించారు. పాఠకులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో మండల గ్రంథాలయ అధికారి విజయభాస్కర్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన

గుంతకల్లు పట్టణం: పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలను తగ్గించాలని బుధవారం గుంతకల్లు పట్టణంలో గుత్తిరోడ్డులో ఆర్టీసీ బస్టాండు వద్ద సీపీఎం పార్టీ, ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో గడ్డి తింటూ నిరసన చేపట్టారు. సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

గుంతకల్లు పట్టణం: గుంతకల్లులో ఓ మహిళ అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు బుధవారం రెండో పట్టణ పోలీసులు తెలిపారు. గత నెల సెప్టెంబరు 14న తిలక్‌నగర్‌కు చెందిన మహిళ పిల్లలను స్కూల్‌కు వదిలి వస్తాను అని చెప్పి ఆరోజు నుంచి కనిపించికుండా పోయింది.

రైల్వే ఇంధన రవాణాపై చర్చలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఇంధనం రవాణా విషయంలో ఏవైనా ఇబ్బందులుంటే తమకు చెప్పాలని డీఆర్‌ఎం విజయకుమార్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నక్కనదొడ్డి డిపో చీఫ్ మేనేజరు నవీన్‌కుమార్‌తో అన్నారు. ఆయన బుధవారం డీఆర్‌ఎం, సీనియర్ డీజీఎం మనోజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం రైల్వే ఇంధన రవాణాపై చర్చించారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా

యల్లనూరు, న్యూస్‌టుడే: నూతనంగా బాధ్యతలు తీసుకున్న సీఐ సత్యబాబు మండలంలో సమస్యాత్మక గ్రామమైన దంతలపల్లెలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఇకపై ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వాహన తనిఖీలు చేపడతామన్నారు. అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఎస్‌ఐ రాంప్రసాద్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


బహుమతితో విద్యార్థులు గౌతమి, సుహన

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని శ్రీసాయి చైతన్య స్కూల్ అండ్ అకాడమీ విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని విశేష ప్రతిభ చూపారు. గౌతమి కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు రాష్ట్రస్థాయిలో జిల్లాను రన్నర్‌ప్‌గా నిలపడంలో ముఖ్యపాత్ర పోషించారు. గౌతమి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనరసింహ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖో పోటీలకు గుత్తి విద్యార్థి

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి వీరశేఖర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. నెల్లూరులో జేఎన్‌టీయూ నిర్వహించిన పోటీల్లో ఆయన జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. అంతర్ యూనివర్సిటీ పోటీల్లో ఆయన ఉత్తమ ప్రతిభ చాటాడు. బుధవారం కాలేజీ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి,ఎండీ రఘునాథరెడ్డి అభినందించారు.

చోరీలతో ప్రజలు బెంబేలు

నిర్లక్ష్యంగా పోలీసులు

నార్పల, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గంలోనే నార్పల మండల కేంద్రం అతిపెద్ద పట్టణంగా గుర్తింపు పొందింది. వ్యాపార వాణిజ్య కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతోంది. మూడు నెలలుగా నార్పలలో చోరీల సంఖ్య పెరుగుతుండటంతో గ్రామ ప్రజలు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. చీకటి పడిందంటే చాలు ఎక్కడో ఒకచోట ఇళ్లలో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. మూడు నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో దొంగతనాలు జరగడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని జనం భయాందోళనకు గురవుతున్నారు.


నార్పలలో ఇటీవల చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

సీసీ కెమెరాల్లో రికార్డవుతున్నా..

✦ నార్పల మండల కేంద్రం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. చుట్టు పక్కల 50 గ్రామాల ప్రజలు వివిధ పనులపై నార్పలకు వస్తుంటారు. ఇదే అదనుగా దొంగలు ఇతర జిల్లాల నుంచి నార్పలకు వచ్చి దొంగతనాలు చేసి దోచుకెళ్తున్నారు. దొంగల వివరాలు సీసీ కెమెరాల్లో రికార్డవుతున్నా నార్పల పోలీసులు తగిన రీతిలో స్పందించడం లేదనే విమర్శలున్నాయి. రెండు నెలలుగా చోరీలు అధికమవడంతో ప్రజలకు రాత్రిళ్లు కునుకులేకుండాపోతోంది.

సీఐ ఏమంటున్నారంటే?

వరుస చోరీలపై సీఐ కౌలుట్లయ్య స్పందిస్తూ నార్పలలో చోరీల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే రాత్రి సమయంలో గస్తీ పెంచడంతో పాటు, పగటి పూట మఫ్టీలో పోలీసు సిబ్బందిని గ్రామంలో తిప్పుతున్నామన్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానంగా తిరుగుతుంటే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం అవసరమని ఆయన కోరారు.

క్షేత్రస్థాయిలో కొన్ని ఘటనలు ఇలా...

✦ నార్పల స్టేట్‌బ్యాంకు దగ్గర రైతు శ్రీనివాసులు ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.3 లక్షలు దొంగలు అత్యంత చాకచక్యంగా ఎత్తుకెళ్లారు. నిందితుల వివరాల సీసీ కెమెరాల్లో రికార్డయినా ఇప్పటికీ దొరలేదు.

✦ నార్పల క్రాస్‌లో రంగాకు చెందిన ద్విచక్రవాహనం ఎత్తుకెళ్లారు. అయితే చోరీ చేసిన నిందితులే తిరిగి బాధితుడిపై కిడ్నాప్ కేసు పెట్టారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. నార్పలలో శివశంకర్ అనే వ్యక్తి ఇంట్లో 4 తులాల బంగారం, రూ.1.60 లక్షల నగదు. గురుప్రసాద్ ఇంట్లో 2 తులాల నగదు, రూ.90 వేలు నగదు. వెంకటరాముడు ఇంట్లో రూ.2.4 లక్షలు నగదు, 5 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. అలాగే ఓబయ్య ఇంట్లో 20 తులాల బంగారం, రూ.60 వేల నగదు. నాగేంద్ర ఇంట్లో 1.45 లక్షల నగదు, 5 తులాల బంగారం. ఇలా చోరీల వివరాల జాబితా చాలానే ఉంది.

✦ నార్పల సంతమార్కెట్‌లో వినియోగదారుల సెల్‌ఫోన్లు పదుల సంఖ్యలో చోరీలకు గురవుతున్నాయని బాధితులు చెబుతున్నారు. వాణిజ్య కేంద్రంగా విస్తరిస్తున్న నార్పలలో దొంగల ముఠాలు విజృంభిస్తుండంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సాగర్, శింగనమల సీఐ కౌలుట్లయ్య నార్పలలో జరుగుతున్న వరుస చోరీలపై నిఘా ఉంచి చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తాం


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రి అభివృద్ధి విషయంలో నిబంధనలు పాటించని వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తానని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన స్వగృహంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన సొంత అభివృద్ధి వద్దని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే తనకు ముఖ్యమన్నారు. పుట్లూరు రోడ్డులోని దేవాలయాలు, పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డుల పక్కన ఇష్టానుసారంగా వ్యర్థాలు పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీటి కాలువల ఆక్రమణలు త్వరలో తొలగిస్తామని తెలిపారు. పట్టణాభివృద్ధికి ఆటంకం కలిగించే వారు తన సొంత బంధువులైనా వదలనని హెచ్చరించారు.

గ్రానైట్ పరిశ్రమల సమస్యలు పరిష్కరిస్తాం: గ్రానైట్ పరిశ్రమలో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం గ్రానైట్ పరిశ్రమ యజమానుల సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమదారుల ప్రతి సమస్యను పరిష్కరించి సంక్షోభం నుంచి ఆదుకుంటామన్నారు.

ఈవో బాధ్యతల స్వీకరణ

తాడిపత్రి పట్టణం: ఆలయాలకు సంబంధించి నూతన ఈవోగా రామాంజినేయులు బాధ్యతలు స్వీకరించారు. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం, చింతల వెంకటరమణస్వామి ఆలయం, తాడిపత్రి మండలంలోని ఆలూరు రంగనాథస్వామి ఆలయం, గంగాదేవిపల్లిలోని గంగాదేవి ఆలయాల ఈవోగా బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు చెప్పారు.

ప్రజాప్రతినిధులకు శిక్షణ

యాడికి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై బుధవారం స్థానిక సమావేశ భవనంలో సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈఓఆర్డీ శశికళ మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో ఆదాయ వనరులు ఎలా సమకూర్చుకోవాలి, అభివృద్ధికి తయారు చేయాల్సిన ప్రణాళికలపై అవగాహన కల్పించారు. ఏట నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

అండర్-15 చెస్ ఛాంపియన్ షిప్‌లో విజేతలు

గుల్జార్‌పేట: అనంతపురం సాయినగర్‌లో ఏ1 ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన అండర్-15 ఓపెన్ బాలికల చెస్ ఛాంపియన్ షిప్-2024లో అనంత జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-15లో ప్రథమ స్థానంలో కె. సాయియశస్ నిలువగా, ద్వితీయ స్థానంలో పి.సంజయ్, తృతీయ స్థానంలో జొన్నగడ్డల నితీష్ నిలిచారు. అండర్- బాలికల విభాగంలో ఛాంపియన్‌గా ఎ.సుకృత నిలువగా, ద్వితీయస్థానంలో సారోన్ బ్లెస్సీ, తృతీయ స్థానంలో కాశి నౌమిక, నాలుగో స్థానంలో త్రిపద నిలిచారు. ఈ రెండు విభాగంలో టాప్-4 విజేతలు గుంటూరులో ఈనెల 15, 16, 17వ తేదీల్లో జరగబోయే ఏపీ రాష్ట్ర అండర్-15 ఓపెన్, బాలికల చెస్ ఛాంపియన్ -2024 ఎంపిక పోటీల్లో పాల్గొంటారు.

పీఎం యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తులు

అనంత సంక్షేమం: జిల్లాలో 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పీఎం యశస్వి సెంట్రల్ సెక్టార్ స్కీం ఆఫ్ టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ ఇన్ స్కూల్స్ ఫర్ ఓబీసీ, ఈబీసీ, అండ్ డీఎన్‌టీ స్కీం ద్వారా ఉపకార వేతనం పొందడానికి అవకాశం ఉందని వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఖుష్బు కొఠారి తెలిపారు. వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించని వారు అర్హులు. 9,10 తరగతి విద్యార్థులకు 8, 9వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక చేసి సంవత్సరానికి రూ. 75వేలు, ఇంటర్ చదివే విద్యార్థులకు 10వ తరగతి మార్కుల ఆధారంగా సంవత్సరానికి రూ.1.25 లక్షలు ఉపకార వేతనం అందజేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు https:///scholarships.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయించాలని సూచించారు.

వయోవృద్ధుల పోషణే లక్ష్యం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వయోవృద్ధుల పోషణ, సంరక్షణపై ప్రభుత్వం అన్ని రకాల చర్యలకు ఉపక్రమించిందని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా, వయోవృద్ధుల శాఖ ఏడీ అబ్దుల్‌రసూల్‌తో కలిసి ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. వయో వృద్ధుల పోషణ-సంక్షేమ చట్టం-2007 ప్రకారం తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని కలెక్టర్ చెప్పారు.

నమోదులో తప్పులుంటే చర్యలు

ఆత్మకూరు, రాప్తాడు: ఈ-పంటపై నమోదైనపంటల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని తలుపూరు, పూలకుంట గ్రామాల్లో రైతు సేవా కేంద్రాన్ని, ఈ-పంట నమోదును పరిశీలించారు. 2024 ఖరీఫ్ ఈ-పంట నమోదుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. .

పారిశుద్ధ్యం గాడిలో పడేదెన్నడు?



హౌసింగ్ బోర్డు కాలనీలో

కమలానగర్, బళ్లారిరోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని పలు రహదారుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. దారుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారయ్యాయి. వాహన చోదకులు, కాలినడకన వెళ్లేటప్పుడు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

- హౌసింగ్‌బోర్డు కాలనీ రాజీవ్ చిల్డ్రన్స్ పార్కుకు వెళ్లే దారిలో రోడ్డు మొత్తం చెత్తమయంగా ఉంది. నిత్యం పార్కు, ఆలయానికి జన సంచారం అధికంగా ఉంటోంది. కనీసం చెత్త కుండీ కూడా లేదు. చెత్త తొలగించి, కుండీ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.
- ఐదోరోడ్డు ఆలయ సమీపంలో చెత్తా చెదారంతో అధ్వానంగా ఉంది. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతంలో చిన్న చెత్త బిన్ను ఉండటంతో నిండి రోడ్డుపై పడుతోంది.
- రెండో రోడ్డులో అపరిశుభ్రత నెలకొంది. చెత్తపై పశువులు సంచరిస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. మూడు రోజులు గడుస్తున్నా చెత్తను తరలించక సమస్య తలెత్తినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



5వ రోడ్డు పెద్దమ్మ ఆలయ సమీపంలో అధ్వానంగా



మురుగు పొంగుతోంది..

రాంనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్డు ఎత్తుగా ఉండి మరికొంత భాగం తగ్గులో ఉండటంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. రాంనగర్ నుంచి చివరకు వెళ్లే మార్గంలో సిరి బహుళ అంతస్తు ముందు భాగాన కొద్దిపాటి వర్షం వస్తే మురుగు కాలువల నుంచి బయటకు పొంగుతోంది. వర్షం వచ్చి మూడు రోజులు దాటినా మురుగు బురద అలాగే ఉంటూ తీవ్ర అసౌకర్యంగా మారుతోంది.

- న్యూస్‌టుడే, రాంనగర్ (అనంత నగరపాలక)

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

ప్రశ్న: రుద్రంపేట పంచాయతీ పరిధి చైతన్య కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయి. సీసీ రోడ్డు నిర్మించాలి

- మద్దన్న, ప్రసాద్, సంజమ్మ, స్థానికులు



సమాధానం: నిధులు మంజూరైన వెంటనే సీసీ రోడ్ల నిర్మాణం చేపడతాం

- హిదయతుల్లా, పంచాయతీ కార్యదర్శి

పంటల సాగులో మెలకువలు పాటించండి

రాప్తాడు, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులు మెలకవలు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామంలో బుధవారం రైతుల పొలంలోకి వెళ్లి పంట పరిశీలనతో పాటు లోపాలను గుర్తించారు.

మద్యం దుకాణాల్లో ఎస్సీ, ఎస్టీలకు కోటా ఇవ్వాలి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం విధానం ద్వారా ఏర్పాటు చేసే మద్యం దుకాణాల టెండర్ల కేటాయింపులో దళిత, గిరిజనులకు కోటా కల్పించాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం అబ్కారీ ఉప కమిషనర్ కార్యాలయంలో ఏఈఎస్ శ్రీరామ్‌ను కలిసి విన్నవించారు.

ఎస్సీ మున్సిపల్ ఉద్యోగుల సంఘ కార్యాలయం ప్రారంభం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అనంత నగర కలెక్టరేట్ ఎదురుగా ఫెర్రర్ విగ్రహం సమీపంలో ఎస్సీ మునిస్పల్ ఉద్యోగుల సంఘం కార్యాలయాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగ, త్రివేణి, నీలిమ **: వెట్టియాన్** గాయత్రి **: సత్యం సుందరం,** గౌతమి **: రామ్‌నగర్ బన్నీ,** గౌరి, ఎస్వీ సినిమాక్స్ **: దేవర,** తరంగిణి **: దక్షిణ,** తేజస్విని **: స్వాగ్.**

రోగులకు అందించే ఆహారంపై ఆరా

అనంతపురం (వైద్యం): ఈనెల 7న 'ఈనాడు'లో ప్రచురితమైన 'రోగులకు రోడ్డుపైనే భోజనం పంపిణీ', సర్వజన వైద్యశాలలో ఇష్టానుసారంగా మెనూ అమలు' కథనంపై ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు స్పందించారు. బుధవారం మధ్యాహ్నం సూపరింటెండెంట్ గైనిక్ వార్డులో గుత్తేదారు సిబ్బందితో రోగులకు పంపిణీ చేయిస్తున్న మెనూను పరిశీలించారు. అన్నం, పప్పు, రసం వంటి తదితర ఆహార పదార్థాల నాణ్యతను చూశారు. రోగులకు సమయానికి అనుగుణంగా మెనూ అందజేస్తున్నారా? లేదా? అని ఆరాతీశారు. కొంతమంది రోగులు కంచంలో అన్ని ఆహార పదార్థాలు ఒకేసారి వడ్డిస్తున్నారని తినలేని పరిస్థితి ఉందని వివరించారు. అన్నం ముద్దగా ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒప్పందం ప్రకారం గుత్తేదారు నాణ్యత కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. మెనూ అమలు తీరుపై సదరు గుత్తేదారు, డైటీషియన్‌కు మెమో ఇస్తున్నామని వెల్లడించారు.



ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

వంకలకు శాశ్వత పరిష్కారం చూపుతాం : ఎమ్మెల్యే

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : అనంతపురం నగరం నడిమివంక, మరువ వంకలకు రక్షణ గోడలు నిర్మించి, ఇళ్ల నీట మునగకుండా శాశ్వతంగా పరిష్కారం చూపుతామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా బుధవారం మూడో రోజు అనంతపురం నగరంలోని సోమనాథనగర్, ఆర్కేనగర్, రజకనగర్‌లో నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నడిమివంక, మరువవంకలకు రక్షణ గోడలు నిర్మించేందుకు రూ.124 కోట్లతో అంచనా వేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, త్వరలో నిధులు మంజూరు చేయించుకుని పనులు మొదలు పెడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్కుల అభివృద్ధికి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.



రజకనగర్‌లో మురుగు కాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్

పనిముట్లు అందిస్తాం

అనంత నగరపాలక: నగరపాలకలోని పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా పనిముట్లు అందే విధంగా చర్యలు చేపడతామని దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదురుగా మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కేకు కోసి పులే, అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రావ్, ఫెర్రర్ చిత్ర పటాలకు పూలమాల వేశారు. నగరం స్వచ్ఛతగా ఉండాలంటే అందులో కార్మికుల శ్రమ ఎంతో ఉంటుందన్నారు.

స్కేటింగ్ మైదానం ఏర్పాటుకు చర్యలు

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), : అనంతపురం నగరంలో స్కేటింగ్ కోసం ప్రత్యేకంగా మైదానం నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం శ్రీనగర్ కాలనీలో జరిగిన జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల ముగింపు కార్యక్రమం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీల్లో విజయం సాధించిన చిన్నారులకు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు.



తపోవనంలో..



బుడ్డప్పనగర్‌లో..



ఆత్మకూరు: సరస్వతీ దేవి అలంకరణలో



రాప్తాడు: ఇంది రమ్మకాలనీలో



ఆజాద్‌నగర్: మాతంగి మాత రూపంలో




పాతూరులో..



ఉమానగర్ రేణుకా యల్లమ్మ గుడిలో



శివకోటిలో



సాయినగర్ నాలుగో క్రాస్‌లో



శారదానగర్‌లో శంకరమఠంలో అక్షరాభ్యాసం

విజ్ఞాన ప్రదాయిని.. నమోస్తుతే

శరన్నవ రాత్రి ఉత్సవ వైభవం వీనుల విందుగా సాగుతోంది. బుధవారం అమ్మవారికి ఎంతో ఇష్టమైన మూలా నక్షత్రం రోజు కావడంతో పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య భక్తి కోటి అమ్మవారి దర్శనం చేసుకొన్నారు. పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శారదానగర్‌లో శారదా మాత ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం చేశారు. **- న్యూస్‌టుడే, అనంతసాంస్కృతికం, రాప్తాడు, ఆత్మకూరు, తపోవనం, బళ్లారిరోడ్డు, ఆజాద్‌నగర్, కమలానగర్**

జీవీ రమణకు దసరా పురస్కారం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సమాజశాస్త్ర విభాగానికి చెందిన ఆచార్య జీవీ రమణ దసరా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ అవని వారధి ఛారిటబుల్ ట్రస్టు వారు ఈ పురస్కారం అందజేశారు. ఆచార్య జీవీ రమణ గత 3 దశాబ్దాలుగా వివిధ సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాలను గుర్తించి హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం చేశారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

కళ్యాణదుర్గంరోడ్డు: అనంతపురం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేయాలని తెదేపా బెస్త సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు చేపలహరి సంకల్పించారు. బుధవారం 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో 50 మంది కార్మికులకు రూ.35 వేలు విలువైన దుస్తులను పంపిణీ చేశారు.

ఆటోనగర్‌లో వసతులు కల్పిస్తాం

రాప్తాడు, న్యూస్‌టుడే : రాప్తాడు మండల కేంద్రంలోని ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాప్తాడు మండల తెదేపా ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళి పేర్కొన్నారు. బుధవారం హెవీ గూడ్స్ లారీ ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో కార్యాలయాన్ని ధర్మవరపు మురళి ప్రారంభించారు. ఆటోనగర్‌లో రోడ్లు, నీటి సదుపాయాలు కల్పిస్తామన్నారు.

ఆధార్ నమోదు శిబిరాలు

అరవిందనగర్: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 10న అంత్యోదయ దివస్ రోజు అనంతపురం డివిజన్ పరిధిలో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నామని డివిజన్ ఎస్పీ గుంపస్వామి తెలిపారు. అనంత టౌన్ షిప్, బాలాజీ విల్లాస్, కడవకొల్లులో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

న్యాయశాస్త్రం పరీక్ష ఫలితాలు విడుదల

ఎస్కేయూ: న్యాయశాస్త్ర 3 సంవత్సరాల కోర్సు 6వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ లోకేష్ తెలిపారు. ఫలితాలు వర్సిటీలో తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పొలంలో దారి సక్రమమే

రాప్తాడు: రాప్తాడు మండలం మరూరు గ్రామం సర్వే నంబర్ 1049 పొలంలో దారి సక్రమమే అని మరూరు గ్రామస్థులు పేర్కొన్నారు. 80 సంవత్సరాలుగా రాకపోకలు కొనసాగుతున్నాయని దారి గురించి తిరుపాల్ వివాదాస్పదం చేయడం తగదన్నారు. గ్రామస్థులు బుధవారం రాప్తాడు ఎమ్మార్వో విజయకుమారికి సమస్యను వివరించారు.

వైద్య ఖర్చులకు సాయం

కమలానగర్: ప్రమాదంలో గాయపడిన పేద యువకుడి వైద్య ఖర్చులకు అనంత స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు రూ.50,150 ఆర్థిక సాయం అందించారు. నవోదయ కాలనీకి చెందిన గంగన్న కుమారుడు రామాంజి గార్లదిన్నె సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లాడు. వైద్యానికి రూ.లక్ష ఖర్చు అవుతుందని తెలుసుకున్న అనంత స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు రూ.50,150 సమకూర్చి అందించారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

ఆజాద్‌నగర్ : నగరంలోని 48వ డివిజన్‌లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పర్యటించారు. సీపీఎం నాయకులు పలు సమస్యలపై విన్నవించారు. తిక్కరంగయ్య స్వామి ఆలయం నుంచి తపోవనం వైపునకు వెళ్లే రోడ్డును సీసీ రోడ్డుగా మార్చాలన్నారు.

15న ఉచిత వైద్యశిబిరం

రుద్రంపేట: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నగరశాఖ, కిమ్స్‌సవీరా ఆసుపత్రి సంయుక్తంగా ఈనెల 15న గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్ బాబు తెలిపారు.



ప్రమాదకరంగా కల్వర్టు

రాంనగర్ పార్కు ఎదురుగా కల్వర్ట్ పైకప్పులు శిథిలావస్థకు చేరడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి కల్వర్ట్ పైకప్పులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**



చెట్టు కొమ్మలను తరలించండి

రైల్వే ఫీడర్ రోడ్డు సైపుల్లా బ్రిడ్జి కింద భాగంలో విద్యుత్తు తీగలకు చెట్టు కొమ్మలు అడ్డు వస్తున్నాయని కొట్టేశారు. రోడ్డుపైనే పడేయటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పశువులు వాటి కోసం వస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, కమలానగర్**



అస్తవ్యస్తంగా రహదారి

జాతీయ రహదారి నుంచి నగరంలోనికి వచ్చే గుత్తి రహదారి నాలుగు వరసల రోడ్డు ప్రమాదకరంగా మారింది. మార్కెట్, డంపింగ్ యార్డు సమీపంలో వేగ నియంత్రణ కోసం పోలీసులు ఏర్పాటు చేసిన డ్రమ్ములు అస్తవ్యస్తంగా ఉన్నాయి. **- ఈనాడు, అనంతపురం**

మహిళకు వేధింపులు.. ఫిర్యాదు

అనంత నేరవార్తలు: రుణం ఇప్పించాలని అడిగిన మహిళను వేధించిన ఘటనలో ఓ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. నగరానికి చెందిన వివాహిత.. తన కుటుంబ అవసరాల నిమిత్తం డబ్బు అవసరమై మారుతినగర్‌కు చెందిన నారాయణస్వామిని సాయం కోరింది. ఏదైనా ఫైనాన్స్ సంస్థలో రుణం ఇప్పించాలని అడిగింది. దీన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు రెండు నెలల నుంచి రుణం ఇప్పిస్తానని చెబుతూ ఉండేవాడు. తరచూ బాధిత మహిళతో ఫోన్‌లో మాట్లాడేవాడు. మాటతీరులో ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఆమె ఫోన్ మాట్లాడటం మానేసింది. దీంతో వేరే ఫోన్ నంబర్ల నుంచి బాధితురాలికి ఫోన్ చేసి తనతో మాట్లాడాలని.. లేకుంటే పరువు తీస్తానని బెదిరించేవాడు. అసభ్యకర సందేశాలు మహిళ చరవాణికి పంపేవాడు. ఒంటరిగా బయటకు వెళ్లేటపుడు మహిళ వెంటపడి భయభ్రాంతులకు గురిచేసేవాడు.

మట్కా బీటర్ల అరెస్టు

అనంత నేరవార్తలు: నగరం గుత్తిరోడ్డులో మట్కా ఆడుతున్న ముగ్గురు జూదరులను వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రూ. 9,300ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

క్రీడా సంబరాలు

ఎస్కేయూ : దసరా పండగ పురస్కరించుకొని అనంతపురం గ్రామీణం చియ్యేడు గ్రామంలో బుధవారం క్రీడా సంబరాలు నిర్వహించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు.

ఉద్యాన రైతులకు ఊతం : ఎమ్మెల్యే సునీత

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో తీవ్ర కరవుతో అల్లాడుతున్న రైతులకు ప్రోత్సాహకాలు అందించి, ఆదుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పరిటాల సునీత ఆదేశించారు. బుధవారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో ఉద్యానశాఖ డీడీ నరసింహారావు, నియోజకవర్గం ఉద్యానాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలాల్లో సాగవుతున్న ఉద్యాన పంటలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతి కందే పరిస్థితి లేదన్నారు. దీంతో బోరుబావుల కింద సాగు చేసుకుంటున్న ఉద్యాన పంటలకు సకాలంలో రాయితీలు అందించాలన్నారు. ఉద్యాన పథకాల సమాచారాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ఈ-పంట నమోదు, ఈకేవైసీ వందశాతం పూర్తి అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అడవులను సంరక్షించడమే లక్ష్యం : సీసీఎఫ్

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని అడవులను సంరక్షించడమే ప్రధాన లక్ష్యమని అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారిణి (సీసీఎఫ్) ఆర్.యశోదబాయి పేర్కొన్నారు. అనంతపురం సీసీఎఫ్ నాగేశ్వరరావు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో సీసీఎఫ్‌గా యశోదబాయిని నియమించారు. ఆమె బుధవారం అనంతపురం ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఐదు డివిజన్లలోని అడవులు, జంతులను సంరక్షించాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులు అందరిపై ఉందన్నారు. జిల్లా సామాజిక వన విభాగం డీఎఫ్‌వోగా చంద్రశేఖర్ బుధవారం జిల్లాకు వచ్చారు. బుధవారం జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ నుంచి చంద్రశేఖర్ బాధ్యతలు తీసుకున్నారు. సామాజిక వన విభాగం పరిధిలోని నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంపకం చేపడుతామని ఆయన తెలిపారు.